teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151


# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 301 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 13 మార్చి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## రైతుల కోసం ప్రత్యేకంగా కమిషన్




రైతుల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం
వరి సాగులో మన రాష్ట్రమే టాప్
రూ. 25 వేల కోట్లతో రైతు రుణమాఫీ
మహాలక్ష్మి స్కీం గేమ్ చేంజర్
స్కిల్ వర్సిటీతో
యువత నైపుణ్యం పెంచుతున్నం
అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

02

# నిరుద్యోగుల సమస్యకు మేమే శాశ్వత పరిష్కారం చూపాం

### రాష్ట్ర సాధనలో నిరుద్యోగుల పాత్ర క్రియాశీలకం

గత ప్రభుత్వానికి నిరుద్యోగుల విషయంలో చిత్తశుద్ధి లేదు
మొదటి ఏడాదిలోనే 55,163 ఉద్యోగాలు భర్తీ చేశాం
నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ రాష్ట్ర సాధనలో నిరుద్యోగుల పాత్ర క్రియాశీలకమైందని, కానీ గత ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో చిత్తశుద్ధి చూపలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటులో మీ కృషి, పట్టుదల ఉందని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మీ జీవితంలో పన్నెండేళ్ళు వృథా అయిందని మండి పడ్డారు.



02



## పార్టీ ఫిరాయింపు కేసులో కీలక పరిణామం

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై మరోసారి విచారణ
ఈ నెల 25లోగా కౌంటర్ దాఖలుకు ధర్మాసనం ఆదేశాలు




తెలంగాణ బ్యూరో, మార్చి 12 (తీన్మార్ న్యూస్): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఇవాళ మరోసారి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలంటూ ఇప్పటికే అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు నోటీసులు అందాయి. అదేవిధంగా అసెంబ్లీ సెక్రటరీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు, పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు

మిగతా 2 లో

## ఒడిదుడుకుల సమయంలో ఉద్యోగుల సహకారం అవసరం

రొటేషన్ పద్ధతిలో ఉద్యోగులకు జీతాలు
వెనుకా ముందు ఆలస్యమైనా సమన్వయం చేసుకోవాలి
అణా పైసా సహా అన్ని లెక్కలు మీకు అందిస్తాం



హైదరాబాద్, మార్చి 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు పెద్ద ఎత్తున ఆర్థిక ప్రయోజనాలతోపాటు వేతనాల పెరుగుదల, పీఆర్‌సీ, డియర్‌నెస్ అలవెన్స్ వంటివి ఇవ్వాల్సి ఉంది. వీటిపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యంగా జీతాలు

మిగతా 2 లో



## ఇంటర్ పరీక్ష ప్రశ్నపత్రాల్లో తప్పుల పరంపర


బోటనీ, మ్యాథ్స్ పేపర్లలో తప్పులు
విషయం గుర్తించిన ఇంటర్ బోర్డు
అధికారులను అప్రమత్తం చేసిన బోర్డు
ప్రశ్నను అటెంప్ట్ చేసిన విద్యార్థులకు ఫుల్ మార్కులు

తెలంగాణ బ్యూరో, మార్చి 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఇంటర్ పరీక్ష ప్రశ్నపత్రాల్లో తప్పుల పరంపర కంటిన్యూ అవుతోంది. బుధవారం కూడా రెండు పేపర్లలో కొన్ని ప్రశ్నలు తప్పుగా వచ్చాయి. బోటనీ, మ్యాథ్స్ పేపర్లలో తప్పులు వచ్చినట్లు ఇంటర్ బోర్డు అధికారులు గుర్తించారు. బోటనీ 5,7 వ ప్రశ్న అలాగే మ్యాథ్స్ 4వ ప్రశ్నలో చిన్న చిన్న తప్పులు వచ్చాయి. విషయం

మిగతా 2 లో

## మార్చిలోనే తలపించనున్న మే నెల ఎండలు

పగటి పూట ఉష్ణోగ్రతలు 39 నుంచి 41 డిగ్రీలుగా నమోదు
ఉష్ణోగ్రతల నేపథ్యంలో అప్రమత్తం చేస్తున్న వాతావరణ శాఖ



తెలంగాణ బ్యూరో, మార్చి 12 (తీన్మార్ న్యూస్): నేటి నుంచి తెలంగాణలో ఎండలు కాక పుట్టించనున్నాయి. వేడి గాలులతో, వడగాల్పులతో వాతావరణం మార్చిలోనే మే నెల ఎండలను తలపించనుంది. హైదరాబాద్ నగరంలో పగటి పూట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు

మిగతా 2 లో



## ఈ నెల 30 నుండి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు

ఏప్రిల్ 7న ఘనంగా స్వామి వారి పట్టాభిషేకం
పట్టాభిషేకంకు రాలేని భక్తుల కోసం పరోక్ష సేవలు : ఈఓ

.. వివరాలు 2లో

## హెూలీ నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు

మార్చి 14న ఉదయం 6 నుంచి 15న 6 వరకు అమలు



హైదరాబాద్, మార్చ్ 12 (తీన్మార్ న్యూస్): కులాలు, మతాలు, ప్రాంతాలు అనే తేడా లేకుండా నిర్వహించుకునే పండుగల్లో హెూలీ ఒకటి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఆరోజున ఉత్సాహంగా

మిగతా 2 లో



02

## డీలిమిటేషన్ పై త్వరలో అఖిలపక్ష సమావేశం

రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖలు
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## ముఖ్యమంత్రి త్వరగా కోలుకోవాలి

బీఆర్ఎస్ మాజీమంత్రి కేటీఆర్ వాఖ్యలు
కేసీఆర్ పై వ్యాఖ్యలకు ట్విట్టర్ వేదికగా స్పందించిన కేటీఆర్



హైదరాబాద్, మార్చ్ 12 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి త్వరగా కోలుకోవాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ పై చేసిన వ్యాఖ్యల పట్ల కేటీఆర్ ట్విట్టర్ వేదికగా

మిగతా 2 లో



## ప్రపంచ దేశాల్లో హాట్ టాపిక్‌గా టారిఫ్స్ అంశం

భారత్ ప్రస్తావన తీసుకొచ్చిన కరోలిన్ లీవిట్
అమెరికా ఉత్పత్తులపై భారీగా టారిఫ్స్ విధిస్తోందని అసహనం

02



## గవర్నర్లు మారడం తప్ప ప్రసంగాలు మారలేదు

గవర్నర్ ప్రసంగంపై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు

హైదరాబాద్, మార్చి 12 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీలో గతేడాది గవర్నర్ ప్రసంగానికి ఈ సారి గవర్నర్ ప్రసంగానికి తేడా ఏం లేదని గవర్నర్లు మారడం తప్ప ప్రసంగాలు మారలేదని


మిగతా 2 లో

# నిరుద్యోగుల సమస్యకు మేమే శాశ్వత పరిష్కారం చూపాం



హైదరాబాద్, మార్చ్ 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సాధనలో నిరుద్యోగుల పాత్ర క్రియాశీలకమైందని, కానీ గత ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో చిత్తశుద్ధి చూపలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటులో మీ కృషి, పట్టుదల ఉందని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మీ జీవితంలో పన్నెండేళ్ళు వృథా అయిందని మండి పడ్డారు. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 55,163 ఉద్యోగాలను భర్తీ చేశామని ఆయన వెల్లడించారు. బుధవారం జూనియర్ లెక్చరర్ పాలిటెక్నిక్ 1532 అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమం రవీంద్రభారతిలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందచేసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి పునాదిగా మారిన నిరుద్యోగుల సమస్యకు మేం శాశ్వత పరిష్కారం చూపామన్న సంతృప్తి మాకుందన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని, దేశ ఆర్థిక భవిష్యత్తు విద్యాశాఖతో ముడిపడి ఉందని, అలాంటి శాఖలో మీరు ఉద్యోగ నియామక పత్రాలు అందుకోవడం గొప్ప విషయం అన్నారు. ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న టీచర్ల బదిలీలు, పదోన్నతుల సమస్యను పరిష్కరించి విద్యాశాఖను ప్రక్షాళన చేశామన్నారు. విద్యా ప్రమాణాలు తగ్గిపోవడం ఆందోళన కలిగించే విషయమని, ఇది తెలంగాణ రాష్ట్రానికి అవమానకరం అన్నారు. అందుకే విద్య ప్రమాణాలు పెంచేందుకు మీరంతా ఒక భావోద్వేగంతో ఉద్యోగ బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తీర్చిదిద్దాలన్నారు. ప్రతీ ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఎక్కడ లోపం ఉందో ఒక్కసారి ఆలోచన చేయండి అన్నారు. విద్యార్థులపై ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు. అది వారి భవిష్యత్ కు పెట్టుబడి అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందో మూలాలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ను నిర్మించబోతున్నాం అన్నారు. ఇటీవలే 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.11000 కోట్లు కేటాయించామని వివరించారు. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని, వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీని ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందన్నారు. క్రికెట్ లో రాణించిన సిరాజ్ కోసం నిబంధనలు సడలించి ఉద్యోగం ఇచ్చాం అని, బాక్సింగ్ లోరాణించిన నిఖత్ జరీన్ కు డీఎస్పీ ఉద్యోగం కల్పించమని, పారాలింపిక్స్ లో రాణించిన దీప్తి జీవాంజీకి ఇంటి స్థలంతో పాటు ఉద్యోగం ఇచ్చామని పేర్కొన్నారు. కొంతమంది స్ట్రేచర్ స్ట్రేచర్ అని మాట్లాడుతున్నారు. స్ట్రేచర్ ఉందని విర్రవీగినవారు స్ట్రెచర్ మీదకు వెళ్లారు. స్ట్రేచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండదు అని చెప్పారు. కేసీఆర్ మాకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమే అన్నారు. ప్రతీ నెలా రూ. 6500 కోట్లు కేసీఆర్ చేసిన అప్పులు తప్పులకే సరిపోతుందన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారని, క్యాన్సర్ ముదురుతుంటే రాష్ట్రం దివాళా తీసిందంటారా అని అంటున్నారు. వాస్తవాన్ని ఎన్నాళ్ళు దాచిపెడతారు? తాను వాస్తవాలు చెబుతుంటే దిగిపో దిగిపో అని మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం మొత్తం ఫ్యామిలీ ప్యాకేజ్ లా అబద్ధాలు మాట్లాడుతున్నారని, అబద్ధాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడపను వాస్తవాలు మీతో పంచుకుని రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తెలంగాణలో భావితరాల భవిష్యత్ నిర్మాణానికి మీ సహకారం అవసరం అన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఒడిదుడుకుల సమయంలో ఉద్యోగుల సహకారం అవసరం



మొదటి పేజీ తరువాయి

ఇస్తున్నామని అయితే వాటికి వీటికి సర్దుబాటు చేస్తూ జీతాలు చెల్లిస్తున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. రొటేషన్ పద్ధతిలో కేటాయింపులు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో మీ సహకారం అవసరం. కొన్నిసార్లు వెనుకా ముందు ఆలస్యమైనా ఇది మన కుటుంబం. మన కుటుంబంలో నెల జీతం సరిపోనప్పుడు ఎలా అయితే సమన్వయం చేసుకుని ఆర్థికంగా సర్దుబాటు చేసుకుంటామో అదే మాదిరి ప్రభుత్వం కూడా అలాగే అని రేవంత్ రెడ్డి ప్రకటించారు. అణా పైసా సహా అన్ని లెక్కలు మీకు అందిస్తా. మీరు ఓ కమిటీ ఏర్పాటుచేసుకుని ఏది పంచుతారో మీరు చెప్పినట్టు చేస్తా' అని ఉద్యోగులకు చెప్పారు. అవును.. జీతాలు బిల్లులు పెండింగ్ పెడుతున్నాం. ఆశ వర్కర్ల జీతాలు, అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు ఆపుతున్నాం. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పెండింగ్ పెట్టి రొటేషన్ చేస్తూ ప్రభుత్వాన్ని నడుపుతున్నాం' అని రేవంత్ రెడ్డి వివరించారు. 'కష్టమైనా.. నష్టమైనా మీకు చెప్పి.. మీకు వివరించి.. మీ అనుమతి తీసుకుని.. ఏం చేయమంటే అది చేస్తా' అని రేవంత్ రెడ్డి తెలిపారు. 'రిజర్వ్ బ్యాంక్ వద్ద తల తాకట్టు పెట్టి అప్పులు తీసుకుని జీతాలు చెల్లించా' అని రేవంత్ రెడ్డి ప్రకటించడం కలకలం రేపింది. ప్రతి నెల రూ.6,500 కోట్ల అప్పులు చెల్లిస్తున్నామని చెప్పారు.

కొలువుల జాతర సభలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆందోళన తీవ్రమైంది. ఇప్పటికే ప్రభుత్వం ఐదు డియర్‌నెస్ అలవెన్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో మరో డీఏ రానుంది. ఇప్పటికే పీఆర్సీ ఇవ్వాల్సి ఉండగా అది కూడా తాత్సారమవుతోంది. ఇక పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు దక్కాల్సి ఉంది. వీటి కోసం ఆశగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు రేవంత్ రెడ్డి బాంబు పేల్చారు. ఆయన వ్యాఖ్యలను పరిశీలిస్తే 'సర్దుకోవాలి' అని చెప్పినట్టు అర్థమవుతోంది. ఇంకొన్నాళ్లు సమయం పడుతుందని పరోక్షంగా చెప్పినట్లు అర్థం చేసుకోవచ్చు.

## హోలీ నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు

మొదటి పేజీ తరువాయి

రంగులు పూసుకొని ఆనందంగా గడుపుతుంటారు. హోలీ పండుగ ఈ ఏడాది శుక్రవారం నాడు జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు పలు ఆంక్షలు విధించారు. 14వ తేదీన ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ 6 గంటల వరకు ఆంక్షలు విధించారు. రోడ్డు మీద వెళ్లేవారిపై రంగులు చల్లితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతేకాదు రోడ్లపై గుంపులుగా ర్యాలీలు నిర్వహించొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని సీపీ అవినాష్ మహంతి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు హోలీ రంగులతో ఇబ్బందిపడే వారు ఇంట్లోనే ఉండాలని బయటకు వచ్చేవారికి విశాల దృక్పథం కలిగి ఉండాలన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం రంజాన్ మాసం కావడం, హోలీ పండుగ శుక్రవారం రావడంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హోలీ వేళ రోడ్ల మీద తిరిగే వారిపై రంగులు చల్లడం కామన్ అయితే. రంజాన్ మాసం పైగా శుక్రవారం కావడంతో ఆరోజున ముస్లింలు చాలా నిష్టగా ఉంటారు. ఈ క్రమంలోనే ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా పోలీసులు ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

## ముఖ్యమంత్రి త్వరగా కోలుకోవాలి



మొదటి పేజీ తరువాయి

స్పందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్విట్టర్ లో కేటీఆర్ ఈ పిచ్చి కుక్క మర్యాదకు ఉండే అన్ని పరిమితులను దాటి ప్రవర్తిస్తుందని అన్నారు. అలాగే ఆయనను వీలైనంత త్వరగా మానసిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని అతని కుటుంబ సభ్యులను అభ్యర్థిస్తున్నాను అంటూ.. లేకుంటే నిరుత్సాహ స్థితిలో చుట్టుపక్కల ఉన్న ప్రతి ఒక్కరినీ కరుస్తాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేగాక ముఖ్యమంత్రి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని బీఆర్ఎస్ నేత రాసుకొచ్చారు. కాగా బుధవారం సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల అనంతరం రవీంద్ర భారతిలో జూనియర్ లెక్చరర్లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాకు స్ట్రేచర్ ఉందని వీర్రవీగారని, ఇకనైనా ఆ వైకరి మార్చుకోవాలని అన్నారు. అంతేగాక స్ట్రేచర్ ఉందని విర్రవీగితే స్ట్రెచ్చర్ మీదికి పంపించారని, ఇలాగే ఉంటే రేపు మార్చురీకి పోవాల్సి వస్తుందని గుర్తుపెట్టుకోవాలని కేసీఆర్ ను ఉద్దేశించి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకు కేటీఆర్ స్ట్రాంగ్ రిప్లై ఇచ్చారు.

## మార్చిలోనే "తలపించనున్న" మే నెల ఎండలు

మొదటి పేజీ తరువాయి



కానున్నాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, యాదాద్రి, మెదక్, సిద్ధిపేట్, సిరిసిల్ల, కామారెడ్డి, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నారాయణ్ పేట్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతుందని వాతావరణ శాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వేసవికాలం ప్రారంభమైన మొదట్లోనే టెంపరేచర్ 40 డిగ్రీలకు చేరువలో ఉంది. మరో రెండు నెలలు వేసవి కాలం ఉండడంతో ప్రస్తుత ఉష్ణోగతలను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గత మూడునాలుగు రోజుల నుంచి సూర్యాపేట జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో 38 డిగ్రీలకు పైగా, 10 ప్రాంతాల్లో 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరుబావుల్లో నీరు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో సాధారణంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ మార్చి రెండో వారంలోనే 35 డిగ్రీలకు చేరుకొని ఆ తర్వాత 40కి అటు ఇటుగా నమోదవుతుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మార్చి 4న 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంతకుముందు వారం రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఈనెల 1న 33 డిగ్రీలు, 2న 35 డిగ్రీలు, 3న మరో రెండు డిగ్రీలు పెరిగి 37కు చేరింది. ఈనెల 4న ఏకంగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నాలుగు మండలాల్లో 38.03 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఎండాలను చూస్తున్న జనం రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు.

## ప్రపంచ దేశాల్లో హాట్ టాపిక్‌గా టారిఫ్స్ అంశం



న్యూ ఢిల్లీ, మార్చ్ 12 (తీన్మార్ న్యూస్): ఇన్నాళ్లు ఆ దేశం ఈ దేశంపై సుంకాలు పెంచుతూ బెదిరిస్తూ వస్తున్న అమెరికాకు షాక్. అదే స్థాయిలో మిగతా దేశాలు సుంకాలు పెంచుతూ ఉండటంతో అధ్యక్షుడు ట్రంప్ గిలగిలాకొట్టుకుంటున్నారు. అన్ని దేశాలు అమెరికా బాటలోనే అమెరికా ఉత్పత్తులపై సుంకాలను పెంచుతుండటంతో ఇప్పుడు అమెరికానే దిగి వస్తుంది. ఈ క్రమంలోనే అమెరికా వైట్ హౌస్ అధికారి మాట్లాడుతూ ఆయా దేశాలు అమెరికా ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాలను వివరిస్తూ వచ్చారు. భారతదేశం గురించి ప్రస్తావిస్తూ అమెరికా ఉత్పత్తులను దిగుమతి చేసుకునే ఇండియా భారీ సుంకాలను విధిస్తుందని అమెరికా మద్యం లిక్కర్ పై 150 శాతం సుంకం విధిస్తుండగా వ్యవసాయ ఉత్పత్తులపై 100 శాతం సుంకం విధిస్తున్నట్లు చిట్టా చదివి వినిపించారు వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టి నాటి నుంచి ప్రపంచ దేశాల్లో టారిఫ్స్ (సుంకాలు) అంశం హాట్ టాపిక్‌గా మారింది. వచ్చి రావడంతోనే ట్రంప్ వివిధ దేశాలపై భారీగా సుంకాలు విధించారు. కెనడా, చైనా, మెక్సికో వంటి దేశాల దిగుమతులపై టారిఫ్స్‌ను భారీగా పెంచేశాడు. ఇదే విధంగా అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూల్ చేస్తోన్న దేశాలపై మేం కూడా అదే రీతిలో టారిఫ్స్ విధిస్తామని ఓపెన్‌గా చెప్పాడు ట్రంప్. ఈ నేపథ్యంలో అమెరికా ప్రొడక్ట్స్‌పై వివిధ దేశాలు విధిస్తోన్న టారిఫ్స్‌పై వైట్ వైస్ బుధవారం రివ్యూ నిర్వహించింది. ఈ సమావేశంలో అమెరికా ఉత్పత్తులపై ఏయే దేశాలు ఎంత మేరకు సుంకాలు విధిస్తున్నాయన్ని జాబితా రెడీ చేశారు అధికారులు. ఈ లిస్ట్ ప్రకారం ఆయా దేశాల దిగుమతులపై కూడా అదే రేంజ్‌లో టారిఫ్స్ పెంచేందుకు వైట్ హౌజ్ సిద్ధం అయ్యింది. ఈ సందర్భంగా వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాపై ఏయే దేశాలు ఎక్కువ సుంకాలు విధిస్తున్నాయన్న వివరాలను ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా కెనడాపై ఆమె విరుచుకుపడ్డారు. అమెరికా ఉత్పత్తులపై భారీగా సుంకాలు విధిస్తూ దశాబ్దాలుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలను, కష్టపడి పనిచేసే అమెరికన్లను కెనడా దోచుకుంటుందని నిప్పులు చెరిగారు. ఈ క్రమంలోనే భారత్ ప్రస్తావన కూడా తీసుకొచ్చారు కరోలిన్ లీవిట్. భారత్ కూడా కొన్ని అమెరికా ఉత్పత్తులపై భారీగా టారిఫ్స్ విధిస్తోందని ఆమె అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అమెరికన్ మద్యంపై 150 శాతం, వ్యవసాయ ఉత్పత్తులపై 100 శాతం సుంకం విధించడాన్ని ఆమె ప్రధానంగా ప్రస్తావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం సహకరించుకోవాలని, న్యాయమైన మరియు సమతుల్య వాణిజ్య పద్ధతులను కోరుకుంటారని ఆమె స్పష్టం చేశారు. అమెరికన్ వ్యాపారం, కార్మికుల ప్రయోజనాలకు ఆయన ప్రాధాన్యత ఇస్తారని పేర్కొంది లీవిట్. రెండో సారి ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక ప్రధాని మోడీ అమెరికా వెళ్లి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల వాణిజ్య సంబంధాలపై చర్చించారు. ఈ భేటీలో అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు భారత్ ఒప్పుకుందని స్వయంగా ట్రంప్ పేర్కొన్నారు. ఈ తరుణంలో వైట్ హౌస్ సెక్రటరీ భారత సుంకాలపై అసహనం వ్యక్తం చేయడం గమనార్హం.

## పార్టీ ఫిరాయింపు కేసులో కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి



ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నోటీసులు అందుకున్న వారు ఈ నెల 25లోగా ఎట్టి పరిస్థితుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కాగా, బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీ లో చేరిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ జనవరి 15న బీఆర్ఎస్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌పై ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ)ను దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికపూడి గాంధీపై కేటీఆర్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, అన్ని పిటిషన్లను ఒకే దగ్గర కలిపి సుప్రీం ధర్మాసనం విచారణ చేపడుతోన్న విషయం తెలిసిందే.

## ఈ నెల 30 నుండి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

తెలంగాణ బ్యూరో, మార్చ్ 12 (తీన్మార్ న్యూస్): భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుండి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. శ్రీ స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవంలో భాగంగా ఏప్రిల్ 6న శ్రీ సీతారాముల కళ్యాణం, 7 న శ్రీ స్వామి వారి పట్టాభిషేకం ఘనంగా నిర్వహించనున్నారు. స్వామి వారి కళ్యాణం, పట్టాభిషేకం తిలకించడానికి ఈ నెల 20 నుంచి వివిధ సెక్టార్ లకు సంబంధించిన టికెట్స్ నేరుగా, 12వ తేదీ బుధవారం నుంచి ఆన్లైన్లో విక్రయుంచునున్నట్లు రామాలయం ఈఓ రమాదేవి తెలిపారు. కళ్యాణం, పట్టాభిషేకంకు రాలేని భక్తుల కోసం పరోక్ష సేవలు పొందవచ్చని అన్నారు. ఆన్లైన్లో టికెట్స్ https://bhadradritemple.telangana.gov.in ద్వారా 12వ తేది నుండి ఆన్లైన్లో పొందవచ్చని తెలిపారు.

## గవర్నర్లు మారడం తప్ప ప్రసంగాలు మారలేదు

మొదటి పేజీ తరువాయి

మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. చేయనివి చేసినట్లు, ఇవ్వని ఇచ్చినట్లుగా అబద్ధాలు, అవాస్తవాలతో కూడిన ప్రసంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్‌తో చెప్పించిందన్నారు. గవర్నర్ ప్రసంగం మొత్తం అర్ధ సత్యాలు, అబద్ధాలు, అవాస్తవాలు. ఏడాదిన్నర ప్రభుత్వ పాలనా వైఫల్యానికి గవర్నర్ ప్రసంగం నిదర్శనం. రేవంతు అబద్దాల ప్రచారాన్ని నమ్మించేందుకు గవర్నర్‌ను వాడుకోవడం సిగ్గుచేటు. గవర్నర్ మహాత్మా గాంధీ చెప్పిన మాటలతో 32 పేజీల ప్రసంగం మొదలు పెట్టారు. నిజానికి రేవంత్ రెడ్డి అత్యుత్తమ మార్గం ఢిల్లీ, చంద్రబాబు సేవలో నిమగ్నం అయ్యాడని తెలంగాణ ప్రజలు భావిస్తున్నరు. సీఎం స్తుతి, అసత్యాలు తప్ప కొత్తగా ఏం లేదు అని సిద్ధిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు.

## ఇంటర్ పరీక్ష ప్రశ్నపత్రాల్లో తప్పుల పరంపర

మొదటి పేజీ తరువాయి

గుర్తించిన ఇంటర్ బోర్డు సిబ్బంది అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో తప్పుగా ఉన్న ప్రశ్నలను సరిచేసి చెప్పాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. అయితే 11, 11 తేదీల్లో జరిగిన పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల్లో కూడా తప్పులు దొర్లాయి. సోమవారం జరిగిన ఇంగ్లీష్ క్వశ్చన్ పేపర్ లో తలెత్తిన తప్పుతో ఆ ప్రశ్నను అటెంప్ట్ చేసిన విద్యార్థులకు ఫుల్ మార్కులు వేయాలని అధికారులు నిర్ణయించారు. మంగళవారం నిన్న కూడా మూడు పేపర్లలో తప్పులు దొర్లాయి. రోజూ ప్రశ్నపత్రాల్లో తప్పులు వస్తుండటంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. దీంతో ఇంటర్ బోర్డు అధికారుల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## డీలిమిటేషన్ పై త్వరలో అఖిలపక్ష సమావేశం

హైదరాబాద్, మార్చ్ 12 (తీన్మార్ న్యూస్): డీలిమిటేషన్ పై త్వరలోనే అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. త్వరలో నిర్వహించబోయే అఖిలపక్ష భేటీకి హాజరు కావాల్సిందిగా భట్టి విక్రమార్క, జానారెడ్డి వివిధ రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖ రాశారు. కాగా ఇటీవల జరిగిన కేబినేట్ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు ఆ లేఖలో వెల్లడించారు. జనాభా ప్రాతిపదికన జరగబోయే డీలిమిటేషన్ తో తెలంగాణ కు అన్యాయం జరగనుందని, జరగబోయే నష్టాన్ని గురించి అన్ని పార్టీలతో చర్చించి, ఒక తీర్మానాన్ని కేంద్రానికి పంపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు నిర్వహిస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీల నేతలు హాజరుకావాలని లేఖలో కోరారు. సమావేశానికి సంబంధించిన తేదీని, వేదికను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. కాగా ఇటీవల సౌత్ లో డీలిమిటేషన్ విధానంపై తీవ్ర చర్చ జరుగుతోంది. దక్షిణాది రాష్ట్రాలు ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయి. తక్కువ జనాభా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు ఈ విధానం వలన నష్టపోతాయని డీలిమిటేషన్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయి. కొనసాగించాలి అనుకుంటే 1971 జనాభా ప్రాతిపదికన తీసుకోవాలని ఇటీవల తమిళనాడు కేంద్రానికి తీర్మానం పంపిన విషయం తెలిసిందే.

## రైతుల కోసం ప్రత్యేకంగా కమిషన్

హైదరాబాద్, మార్చ్ 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రానికి అన్నదాతలే ఆత్మ అని, రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రైతుల స్వేదం, కష్టం మనలను పోషిస్తోందని చెప్పారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని అన్నారు. రైతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసిందని చెప్పారు. సన్నవడ్లు పండించిన రైతులకు క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వడం సత్ఫలితాలను ఇస్తోందని చెప్పారు. రూ. 25 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశామని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల చొప్పున వారికి అందిస్తున్నాం. రైతు నేస్తం అమలు చేస్తున్నామని అన్నారు.

**మహాలక్ష్మి గేమ్ చేంజర్**

రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు. ఉచిత బస్సు పథకానికి రూ.5,005 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. ఉచితంగా రూ. 500 సిలిండర్ ఇస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మహిళా సంఘాలతో ఇందిరా శక్తి క్యాంటిన్ లు ఏర్పాటు చేశాం. మహిళా సంఘాలకు యూనిఫాంలు కుట్టే అవకాశం కల్పించామని చెప్పారు. మరోవైపు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో యవతలో నైపుణ్యాన్ని పెంచుతున్నామని అన్నారు. పేదకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలిపారు. నిరుపేదలను అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఏడాదిలోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తే చేశామని, ప్రపంచ స్థాయి ఆటగాళ్లను తయారు చేసేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. రాష్ట్రానికి రూ.1.78 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆ పెట్టుబడుల ద్వారా 49,500 మందికి ఉపాధి లభించనుందని అన్నారు.

## ఇంటర్న్ షిప్ కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్దార్థ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇంటర్న్ షిప్ కొరకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్దార్థ తెలిపారు. దరఖాస్తు చేయుటకు ఈ నెల 31వ తేది వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 745 జిల్లాలు మరియు 25 సెక్టార్లలో 1.25 లక్షల కంటే ఎక్కువ ఇంటర్న్ షిప్స్ కు అవకాశం కల్పించ బడుతుందని ఆయన తెలిపారు. యువత సొంత రాష్ట్రంలో కానీ లేదా ఇతర రాష్ట్రంలోనైనా 5 ఇంటర్న్ షిప్ లకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తు చేసేందుకు 1800 116 090 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేయాలని, నమోదుకు %జూఎఅత్వతీఅంష్ట్రఅజూ.ఎమ్ఖ.స్త్రశీజ.అఅ% ఆన్లైన్ లో దరఖాస్తులు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన జిల్లాకు 23 ఇంటర్న్ షిప్స్ కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు 21-24 మధ్య వయస్సు కలిగి ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారికి 13, డిప్లొమో చేసిన వారికి 2, ఐటీఐ చేసిన 8 మందికి అవకాశం ఉందని అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు 5 వేల రూపాయలు ఉపకార వేతనం అందచేయబడుతుందని ఆయన పేర్కొన్నారు.

## నష్టపోయిన మొక్కజొన్న పంటల క్షేత్ర పరిశీలన





ములుగు జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశానుసారము తెలంగాణ విత్తన సర్టిఫికేషన్ ఏజెన్సీకు సంబంధించినటువంటి జెడిఎ సీడ్స్ జి లక్ష్మణ్, డిడి హెడ్ క్వార్టర్స్ కే శంకరయ్య ఏడిఎస్సి బి సంతోష్, ఏడిఎస్సి పి వేమా, ఎస్ సి ఓ అపర్ణ, ఎస్ సి ఓ టి వేణుమాధవ్ ఈరోజు మొక్కజొన్న నష్టపోయినటువంటి రైతు సోదరుల క్షేత్ర పరిశీలన కోసము హైదరాబాద్ నుంచి రావటం జరిగింది. వారు కన్నాయిగూడెం వెంకటాపురం మరియు వాజేడు మండలాల్లో మొక్కజొన్న విత్తన ఉత్పత్తి చేస్తున్నటువంటి రైతుల క్షేత్ర పరిశీలన చేసి గౌరవ వ్యవసాయ శాఖ మంత్రికి నివేదిక సమర్పించడం జరుగుతుంది. వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశానుసారము కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి నష్టపోయినటువంటి రైతు సోదరులకు నష్టపరిహారం ఇప్పిచ్చుట కొరకు అదేవిధంగా బీటీ అనే ఆరోపణతో మొక్కజొన్న యొక్క లీఫ్ అనాలసిస్ మరియు గింజల పరిశీలనకి నమూనాలు సేకరించి హైదరాబాదులోని ల్యాబ్ కి పంపించడం జరుగుతుంది. తదుపరి గౌర వ్యవసాయ శాఖ మాత్తులు ఆదేశానుసారము చర్యలు తీసుకోబడతాయి.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మసిస్ట్ల పాత్ర కీలకం

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్**





మహబూబాబాద్ జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మసిస్ట్ లు ముఖ్య పాత్ర పోషిస్తారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ కొనియాడారు. ఎనిమీయ ముక్తి భారత్ లో భాగంగా బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని పత్తిపాక రోడ్డు నందు గల IMA సమావేశ మందిరంలో జిల్లాలో పనిచేస్తున్న ఫార్మసిస్టులందరికీ , మందుల పంపిణీ గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ మాట్లాడుతూ, మందులు ఎక్స్పైరీ కాకుండా చూసుకోవాలని, మందుల ఇండెంట్, మూడు నెలల ముందుగానే సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ కి లెటర్ పెట్టాలని, మందుల డోసుల వివరాలను, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎనీమియా ఉన్న గర్భిణీ స్త్రీలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను పంపిణీ చేయాలని, ఆరు నెలల నుండి 59 నెలల పిల్లలకు ఐఎఫ్ఎ సిరప్, ఐదు సంవత్సరాల నుండి 9 సంవత్సరాల పిల్లలకు ఐ ఎఫ్ ఏ పింక్ కలర్ టాబ్లెట్లని, అదేవిధంగా 10 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఐ ఎఫ్ ఏ నీలం రంగు టాబ్లెట్స్ ని ఏడాది పొడవునా అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెటర్నల్ చైల్డ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు, శిక్షకులు ఇన్చార్జి డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ, ఫార్మసిస్ట్ రామారావు సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, , డి.ఈ.ఓ అరుణ్, జిల్లాలోని ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

# గ్రామాలలో సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేయాలి

**అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలి**

**మండల స్థాయి అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): మండల కేంద్రంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని, గ్రామాలలో సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.
అన్నారు. బుధవారం వాజేడు మండల కేంద్రంలో ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను నిజమైన అర్హులను గుర్తించి అందజేయడానికి చొరువ చూపాలని, మండల కేంద్రాలలోని ఎంపీడీవో, ఎంపీవో కీలక పాత్ర పోషించాలని అన్నారు. వేసవికాలంలో గ్రామాలలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలని, అవసరమైన పక్షంలో వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకొని మంచి నీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మండలంలో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతుల వివరాలను ఇప్పటికే సేకరించడం జరిగిందని, నష్టపోయిన రైతులకు ఆయా విత్తన కంపెనీల ద్వారా నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు. నష్టపోయిన రైతుల వివరాలను మండల వ్యవసాయ కార్యాలయంలో రెవెన్యూ కార్యాలయంలో సూచిక బోర్లపై పేర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, నష్టపోయిన రైతు పేరు లేని పక్షంలో గురువారం లోగా పేరు నమోదు చేయించుకోవాలని అన్నారు. మండలంలో అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఆయా పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. అనంతరం ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రతలపై దృష్టిని పెట్టాలి



**జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**

హనుమకొండ జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): గురుకులాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రత, టాయిలెట్ల నిర్వహణ బాగుండే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, కస్తూరిబా విద్యాలాయాల్లో ఫుడ్ సేఫ్టీ, వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనుల పై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం 110 గురుకులాలు ఉన్నాయని, భోజనం, ఇతర వసతులను జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారని జిల్లా రెవెన్యూ అధికారి వై. వి. గణేష్ కలెక్టర్ కు వివరించారు. గురుకులాల్లో తాగునీరు, టాయిలెట్స్, మెష్ డోర్స్, కాంపౌండ్ వాల్స్, ఇతర మౌలిక వసతుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వివిధ గురుకులాల్లో సమస్యలు కలెక్టర్ అడిగి తెలుసుకుని వాటి పరిష్కరానికీ తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గురుకులాల్లో కల్పిస్తున్న వసతుల పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గురుకులాల్లోని అన్ని వసతులు బాగుండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల విద్యాలయాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి అందించాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని, బియ్యం, పాలు, కూరగాయలు, ఇతర సరకులు నాణ్యతగా ఉండాలన్నారు. మైనర్ రిపేర్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా గురుకులాలకు నీటి సరఫరా జరగాలన్నారు. సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనంతో పాటు పరిశుభ్రత, టాయిలెట్ల నిర్వహణ బాగుండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఈవో వాసంతి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమ-రయ్య, పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, వివిధ గురుకులాల అధికారులు పాల్గొన్నారు.

## యుజిసి నూతన ముసాయిదాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

**ఈ నెల 15న పీడీఎస్యూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం**



హనుమకొండ కేయు, మార్చి 12 (తీన్మార్ న్యూస్): ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో విలేకరు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ యుజిసి నూతన ముసాయిదాలు యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తికి పెనుముప్పుల మారిందని ఈ ముసాయిదాలను వెనక్కి తీసుకోవాలని, ఎన్ ఈ పి 2020లో భాగమైన డిటెన్షన్ విధానాలు బడుగు బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే విధంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు శ్రామికులను తయారు చేయాలనే కుట్రలో భాగంగానే డిటెన్షన్ విధానాలను తీసుకు వచ్చిందని, రానున్న అసెంబ్లీ సమావేశంలో ఎన్ ఈ పి 2020 ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోమని తీర్మానం చేయాలని పి డి ఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ అంశాలపై 15 తారీకు శనివారం రోజున కాకతీయ యూనివర్సిటీ జాఫర్ నిజాంహాల్ లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని దీనిలో వక్తలుగా టిపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర్ సార్, పిడిఎస్యూ జాతీయ నాయకులు పి. మహేష్ రాష్ట్ర అధ్యక్షాకార్యదర్శులు శ్రీకాంత్ పొడపాంగి నాగరాజు పిడిఎస్యూ పూర్వ జిల్లా అధ్యక్షులు, రాచర్ల బాలరాజు పాల్గొంటున్నారని ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అన్ని విద్యార్థి సంఘాలు పాల్గొని యూజీసీ నూతన ముసాయిదాలు మరియు డిటెన్షన్ విధానాలపై వాళ్ళ అభిప్రాయాలను వ్యక్తం చేయవలసిందిగా కోరుతున్నాము అని అన్నారు,ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి పవన్,సభ్యులు రాజేష్, అనిల్, గణేష్ పిడిఎస్యూ విద్యార్థులు రతీష్,వినయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఇనుపరాతి గుట్ట భూములపై అధికారులతో కలెక్టర్ సమీక్ష





హనుమకొండ జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం, దేవునూరు గ్రామాల్లో విస్తరించి ఉన్న ఇనుపరాతి గుట్ట పరిధిలో ఫారెస్ట్ అధికారులు గుర్తించిన వ్యవసాయ పట్టాభూముల పై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీవో రాథోడ్ రమేష్, ల్యాండ్ సర్వే విభాగం ఏడి శ్రీనివాసులు, ధర్మసాగర్ తహసీల్దార్ గుత్తికొండ సదానందం, అటవీ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూముల సర్వే, సంబంధిత రైతుల గుర్తింపు, తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పలు గ్రామాలకు చెందిన రైతులకు పట్టాపాస్ పుస్తకాలు ఉండి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ లో లేని వారి భూములను కూడా అటవీ శాఖ తమ ఆధీనంలోకి తీసుకోగా వాటిని తిరిగి గుర్తించి ఆ పట్టా భూములను రైతులకు స్వాధీన పరచాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. పట్టా పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు చెందిన 45 ఎకరాల వ్యవసాయ భూమిని వారి ఆధీనంలోనే ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కుడా పీవో అజిత్ రెడ్డి, వేలేరు తహసీల్దార్ కోమి, అటవీ, సర్వే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లో ఉచిత శిక్షణ



మహబూబాబాద్ జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ శిక్షణా సంస్థ ద్వారా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లో బి.సి. విద్యార్థులకు ఒక నెల పాటు నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బి.సి. స్టడీ సర్కిల్ డైరెక్టర్ %ణతీ%.ఎంపీవి ప్రసాద్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ప్రైవేటు బ్యాంకుల్లో ప్లేస్ మెంట్ కల్పిస్తారని ఆయన తెలిపారు. డిగ్రీ పూర్తయిన 26 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు. ఈనెల 15వతేదీ నుండి ఏప్రిల్ 8వ తేదీ వరకు దరఖాస్తులను %షష్.స్త్రఎఠర్బఎఎఆతీ-ఎశ్రీవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.అఅ% ఆన్ లైన్ ద్వారా చేసుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలలోపు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్ లైన్ ద్వారా పరీక్ష ఉంటుందని, పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా (30) మందిని ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు. మరింత సమాచారం కోసం 040-29303130 ని సంప్రదించాలని ఆయన కోరారు.

# ఉపాధి హామీ లక్ష్యాలను పూర్తి చేయాలి

**మార్చి 15లోగా వంద శాతం ఆస్తి పన్ను వసూలు చెయ్యాలి**

**వ్యవసాయ భూమిలో ఫారం పాండ్ ఖచ్చితంగా ఏర్పాటు చేయాలి**

**పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు చేపట్టాలి**

**ఇందిరమ్మ ఇండ్ల ఎల్ -1 జాబితాను పూర్తి చేయాలి**

**అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఉపాధి హామీ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అతను విద్యాచందన తో కలిసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరు క్లస్టర్ వారిగా పని దినాలు చేపడుతున్న పనులు, ఆస్తి పన్ను వసూలు పురోగతి, ధరణి పెండింగ్ దరఖాస్తులు, ఎల్ ఆర్ ఎస్ పెండింగ్ దరఖాస్తులు తదితర అంశాలపై జిల్లాలోని తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు మరియు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి పనులు కల్పించేందుకు ఎక్కువ అవకాశం గల పనులు పై దృష్టి సారించాలని, ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపడుతున్న ఫారం పాండ్స్, ఫీడర్ ఛానల్ పనులు, రోడ్డు ఫార్మేషన్,ట్రంచ్ వర్కులు, బౌండరీలు తదితర పనులకు సంబంధించి అంశాలపై క్లస్టర్ల వారీగా సమీక్షించారు. క్లస్టర్ల వారీగా చేపట్టే పనులలో లేబర్ మొబలైజేషన్ ఎక్కువగా ఉండాలని, వారికి పని దినాలు కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో ఫారం పాండ్స్ కచ్చితంగా ఏర్పాటు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో బోరు పై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల వివరాల జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఫారం పాండ్స్ తవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, పందిరి సాగు, చేపల పెంపకం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలను పెంచడం కోసం, ఆనంద కాలంలో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు ప్రతి రైతు కచ్చితంగా ఫారం పాండ్ లు ఏర్పాటు చేయవలసిందే అని ఆయన స్పష్టం చేశారు. మార్చి 31 వ తారీకు లోపల ఉపాధి హామీ పనులన్నీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా గ్రామాల అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేసేలా, రేపు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకచోట ఇంకుడు గుంతలు తవ్వకాలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పనులన్నీటిని ఉపాధి హామీ పథకంలో కాకుండా గ్రామాల్లోని అందరి సమన్వయంతో నిర్వహించాలని దానికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఒక గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, రహదారుల పక్కన ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని ఆయన తెలిపారు. చేపట్టిన నిర్మాణాలు అన్నింటి నీ జల సంచేయ్ జన్ భగీదారి ప్రోగ్రాంలో అప్లోడ్ చేయాలని, దాని ద్వారా దేశంలోని జిల్లా ఇంకుడు గుంతల నిర్మాణాల్లో మొదటి నిలిచేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మార్చి 15 తేదీలోగా జిల్లాలోని అన్ని ఆస్తి పన్నుల బకాయిలు 100 శాతం వసూలు చేయాలని పంచాయతీ సెక్రటరీలను కలెక్టర్ ఆదేశించారు. మార్చి 15 తరువాత ఎవరైతే బకాయిలు చెల్లించలేదో వారి వివరాలను ఫ్లెక్సీల ద్వారా గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని, లేదా ఇంటిముందు డప్పులు వాయించాలని కలెక్టర్ తెలిపారు. ఆస్తి పన్నులు ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న ధరణి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. త్రాగునీటి సరఫరా లో సమస్యలను సత్వరమే పరిష్కరించి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల ఎల్ వన్ జాబితాను శనివారంలోగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, పిడి హౌసింగ్ శంకర్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు , మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్, నళిని, డి ఎల్ పి ఓ సుధీర్, మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో వేగంగా జరుగుతోన్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియ

**ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారుల చొరవ**

**25 శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**మార్చి 31లోగా ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**






జనగామ జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): అనధికార లే అవుట్ ప్లాట్లు, అనధికార లే అవుట్ లను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో 2020 సంవత్సరంలో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మార్చి 31, 2025 లోగా క్రమబద్ధీకరించి రుసుము చెల్లించిన వారికి 25 శాతం రాయితీ లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. జిల్లాలో లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కోసం దరఖాస్తు చేసుకున్న వారు రుసుము చెల్లించి రాయితీని పొందుతూ ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు చొరవ చూపుతున్నారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని మునిసిపల్ కార్యాలయం, అలాగే రఘునాథపల్లి మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహిస్తోన్న ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీనిస్తూ, వెంటవెంటనే భూమి క్రమబద్ధీకరణకు సంబంధించిన ప్రొసీడింగ్ లు జారీ చేయడం జరుగుతోందని వివరించారు. మిగిలిన దరఖాస్తుదారులు కూడా నిర్ణీత గడువు లోపు ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలని, రాయితీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు. స్థలాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఎల్ఆర్ఎస్ రుసుములు చెల్లించిన వారికి స్థల క్రమబద్ధీకరణ చేసి సంబంధిత ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్నామన్నారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణను ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని, దరఖాస్తుదారులందరికి ఫోన్ కాల్ చేసి రాయితీని వినియోగించుకునేలా మునిసిపల్ సిబ్బంది ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం ఆస్తి పన్ను గురించి మాట్లాడుతూ.. ప్రతి రోజు రూ. 8 లక్షల నుంచి రూ. పది లక్షల వరకు ఆస్తి పన్నులు వసూలు చేయాలని, పన్ను ఎగవేతదారులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ - 1864 ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఇప్పటివరకు మున్సిపల్ పరిధిలో (113) మందికి నోటీసులు జారీ చేశారని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఎంపిడిఓలు ఎల్ఆర్ఎస్ పై దరఖాస్తుదారులకు ఫోన్ కాల్ చేసి ఈ నెల 31లోపు.. 25 శాతం రాయితీని ఉపయోగించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. సంబంధిత సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈ సేవలను పొందవచ్చునని, మార్చి 31 లోపు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు. సందేహాల నివృత్తికి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయకేంద్రం నంబర్ 9948187334, అలాగే జనగామ పురపాలక సహాయ కేంద్రం నంబర్ 8978207205 లలో సంప్రదించవచ్చని తెలియజేస్తున్నారు.

# గత సర్కారు వైఫల్యం మరమ్మతులు చేపట్టండి

**ఇరిగేషన్ హస్తవ్యస్తం - పడకేసిన రిజర్వాయర్ కాల్వ సమస్యలు.**

**దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డికు కాల్వ సమస్యలపై వినతి పత్రం.**

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్.**

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జిఎస్ గోపి.**

**సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెంకటే రాములు.**



దేవరకద్ర ప్రతినిధి,మార్చి12(తీన్మార్ న్యూస్) : సాగునీటి ఎనుకుంటా రిజర్వాయర్ కాలువ ఇరిగేషన్ ఆస్తవ్యస్తంగా మారడంతో మరమ్మతులు ఎక్కడివి అక్కడే పడకేశాయని,రైతులకు చివరి వరకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని,వెంటనే కాలువ పూడికతీత పనులు చేపట్టాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బర్,సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జిఎస్ గోపి,సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెంకట రాములు. ఈ సందర్భంగా.. కాలువ పంటల సమృద్ధిగా పండేందుకు కీలక భూమి పోషించే సాగునీటి కాలువలు నిర్వహణ గత పాలకులు నిర్లక్ష్యం ఫలితంగా అద్వానంగా మారిందని తెలిపారు. అంతేగాక సాగునీటి కాలువలు నిర్వహణకు పదిహేను ఏండ్లుగా ప్రభుత్వాలు పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని,ఎనుకుంటా ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని,రైతులు ఆందోళన చెందుతున్నారని కోరారు. ముఖ్యంగా ఆయకట్టు పరిధిలోని వడ్డవాట,తాండ,తీర్మాలయాపల్లి, అజ్జకొల్లు గ్రామాల భూములకు సాగునీటిని అందించుకు కాలువలో సంవత్సరాల తరబడి కూడికల తీయకపోవడంతో కంపచెట్లు,పిచ్చి మొక్కలు,జమ్మూ,ఇసుక దిబ్బలు సిల్టు విపరీతంగా విపరీతంగా పెరిగి కాలువ దెబ్బతినిందన్నారు. సుమారుగా కాల్వ 10 కిలోమీటర్లు ఉండగా నాలుగు కిలోమీటర్లు మాత్రమే నీరు పారుతుందని దీంతో రైతులు బోరు బావులు కాల్వ కింద వేల ఎకరాలు సాగు చేస్తున్నారని నీరు అందక పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఎండాకాలంలో పంటలు ఎండిపోకుండా రైతులు సాగునీటి కష్టాలు తీర్చాలని ఆయకట్ట రైతులు తరపున కోరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చు

**జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): సమగ్ర వ్యవసాయం తోనే అధిక దిగుబడులు సాధించవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం రామవరం లోని రైతు వేదికలో వాలంతరి, రాజేంద్రనగర్ హైదరాబాద్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ బృందంతో ఏ ఈ ఓ లకు, రైతులకు నీటి నిర్వహణ, మట్టి, నీటి సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఇందుకుగాను నీటి కుంటల నిర్మాణం, మునగ సాగు, ఆయిల్ ఫామ్, అజోల్ల పెంపకం, తిప్ప, కరక్కాయ వంటి ఔషధ మొక్కలను పుట్టగొడుగుల పెంపకం, పెంపకం, తుల పెంపకం ద్వారా రైతులు అదనంగా ఆదాయం సంపాదించవచ్చని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని ఏఈఓ లను ఆదేశించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, ప్రకృతి వ్యవసాయం, పంట మార్పిడి మరియు జిల్లాలోని వ్యవసాయకు సంబంధించిన ప్రస్తుత పంటల యొక్క సమస్యలు మరియు పరిష్కారాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు,వాలంతరీ డైరెక్టర్ విజయ గౌరీ, వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారావు మరియు వాలంతరీ ఏ డి ఏ సునీత మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కంది పప్పు సరఫరాకై టెండర్లుకు కొటేషన్లు అందించాలి

జనగామ జిల్లా, మార్చి 12 (తీన్మార్ న్యూస్): జిల్లా మహిళా శిశుసంక్షేమం, దివ్యంగులు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా లోని 695 అంగన్ వాడి కేంద్రములకు కంది పప్పు సరఫరాకై జనగామ జిల్లా లోని (03) ఐ.సి.డి.యస్. ప్రాజెక్టుల (జనగామ, కొడకండ్ల, స్టేషన్ ఘనపూర్) పరిధిలో గల (695) అంగన్ వాడి కేంద్రముల వద్దకు ఏప్రిల్- 2025 నుండి మార్చ్- 2026 సంవత్సరం కాలానికి గాను కంది పప్పు కిలో లామినేటెడ్ ప్యాకెట్లతో బయోమెట్రిక్ ద్వారా నేరుగా కేంద్రముల వద్దకు సరఫరా చేయుట కొరకు రవాణా ఛార్జీలతో పాటు జి.ఎస్.టి కలుపుకొని కంది పప్పు సరఫరా చేయుటకు ఆసక్తి గల సంస్థల సరఫరాదారుల నుండి కొటేషన్స్ అందించాల్సిందిగా కోరారు. సంబంధిత కొటేషన్స్ ను జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో మార్చ్ 17, లోపు అందజేయాలన్నారు.

# దండి మార్చ్ లో పాల్గొన్న వారందరికి ప్రధాని నివాళ్లు



న్యూ ఢిల్లీ, మార్చ్ 12 (తీన్మార్ న్యూస్): చారిత్రాత్మక దండి మార్చ్‌లో పాల్గొన్న వారందరికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం నివాళులర్పించారు. మహాత్మా గాంధీ నేతృత్వంలోని మార్చ్ స్వావలంబన మరియు స్వాతంత్ర్యం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని రగిలించిందని శ్రీ మోదీ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. దండి మార్చ్‌లో పాల్గొన్న వారందరి ధైర్యం, త్యాగం మరియు సత్యం మరియు అహింస పట్ల అచంచల నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉందని ప్రధానమంత్రి అన్నారు.

# స్పీకర్ అధ్యక్షతన ముగిసిన బీఏసీ సమావేశం

**ఈ నెల 27 వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించుటకు నిర్ణయం**

**మార్చి 21, 26ల్లో వివిధ పద్దులపై సభలో వాడీవేడి చర్చ**



హైదరాబాద్, మార్చి 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశం కాసేపటి క్రితం ముగిసింది. ఈ మేరకు బడ్జెట్ సమావేశాలను ఈ నెల 27 వరకు నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా 19న ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సభలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అదేవిధంగా 13న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కొనసాగనుంది. 14న హోలీ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. ఈ నెల 21 నుంచి 26 వరకు వివిధ పద్దులపై సభలో వాడీవేడి చర్చ జరగనుంది. అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో నిర్వహించిన బీఏసీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. కాగా, రూ.3.20 లక్షల కోట్లతో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక శాఖ రెడీ చేసినట్లుగా తెలుస్తోంది.




# డంకీ రూట్‌లో అమెరికాకు పయనం

## ఇద్దరు భారతీయులు కిడ్నాప్

**న్యూఢిల్లీ :** అమెరికాలో అక్రమంగా ఉంటున్నవారిని అక్కడి ప్రభుత్వం వెనక్కి పంపుతున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భారతీయులు అక్రమంగా ఇతర దేశాలకు వెళ్లడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ కొందరు ప్రమాదకరమైన డంకీ మార్గాల్లో అగ్ర దేశానికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలో డంకీ మార్గంలో అమెరికాకు వెళ్తున్న ఇద్దరు భారతీయులు గ్వాటెమాలాలో కిడ్నాప్‌కు గురయినట్లు తెలుస్తోంది. వారిని విడిచిపెట్టేందుకు 20 వేల డాలర్లు ఇవ్వాలని కిడ్నాపర్లు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈమేరకు బాధిత కుటుంబాలు వాపోయినట్లు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. కిడ్నాప్‌కు గురైన వారిలో హరియాణాకు చెందిన యువరాజ్ సింగ్ ఒకరు. ఆయన తండ్రి కుల్దీప్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 'నా కుమారుడు అమెరికాకు వెళ్లాలనే ఉద్దేశంతో ఓ ఏజెంట్‌ను సంప్రదించాడు. చట్టపరంగా అక్కడికి వెళ్లేందుకు రూ.41 లక్షలకు డీల్ కుదిరింది. తొలుత రూ.2 లక్షలు చెల్లించగా.. మిగిలినవి ఆ దేశానికి వెళ్లాక చెల్లించాలనేది ఒప్పందం. అయితే, మధ్యలోనే మరో రూ.14 లక్షలు తీసుకున్నారు. అయితే, అమెరికాకు బయలుదేరిన తర్వాత యువరాజ్ నుంచి ఫోన్ కాల్స్ రాలేదు. ఫోన్ నెట్‌వర్క్ లేని ప్రాంతాల నుంచి వెళ్తున్నారని, ఆ దేశం చేరుకున్నాక మాట్లాడవచ్చని ఏజెంట్లు భరోసా ఇచ్చారు. అయితే, గతేడాది డిసెంబరులో కిడ్నాపర్ల నుంచి మాకు ఒక వీడియో వచ్చింది. అందులో కొందరు వ్యక్తులు యువరాజ్‌ను చిత్రహింసలు చేస్తూ గన్ చూపించి బెదిరించారు. అతన్ని విడిచిపెట్టాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు' అని కుల్దీప్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. కిడ్నాప్‌కు గురైన మరో వ్యక్తి పంజాబ్‌లోని హూషియాపూర్ జిల్లాకు చెందినవారు. వారిని విడిచిపెట్టేందుకు 20 వేల డాలర్లు డిమాండ్ చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వారి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ట్రావెల్ ఏజెంట్లపై స్థానిక పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇక, తమ కుమారులను భారత ప్రభుత్వం రక్షించాలని బాధిత కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే ఇటీవల అనేకమంది భారతీయులను సైనిక విమానంలో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే.


## స్విట్జర్లాండ్ వెళ్తున్నానని బంగారం కొని..

# భారత్‌లో ల్యాండ్ అయిన రన్యారావు



**బెంగళూరు :** దుబాయ్ నుంచి విమానంలో అక్రమంగా బెంగళూరుకు బంగారాన్ని తెస్తూ దొరికిపోయిన నటి రన్యారావు కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గత ఏడాది చివర్లో రెండుసార్లు దుబాయ్‌లో బంగారం కొనుగోలు చేసిన ఆమె.. దానిని తీసుకొని తాను స్విట్జర్లాండ్ వెళ్తున్నానని అక్కడి కస్టమ్స్ అధికారులకు వెల్లడించారు. కానీ ఆమె ప్రయాణ వివరాలను పరిశీలిస్తే, ఆమె భారత్‌కు వచ్చినట్లు వెల్లడైందని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తన అరెస్ట్ మెమోలో పేర్కొంది. విమానాశ్రయంలో గ్రీన్ ఛానల్ ద్వారా వెళ్తున్నప్పుడు తన దగ్గర సుంకాలు విధించే వస్తువులు ఏవీ లేవని నటి చెప్పారు. కానీ మెటల్ డిటెక్టర్ వద్ద మాత్రం ఆమె దొరికిపోయారు. ఆ వెంటనే కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారులు ఆమెను ఆపి, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దానికి సంబంధించిన కాగితాలను ఆమె చూపించలేకపోయిన సంగతి తెలిసిందే. నడుము చుట్టూ, కాళ్ల కిందిభాగం, షూలో ఆ బంగారాన్ని దాచారు. విమానాశ్రయంలోని గ్రీన్ ఛానల్‌లో వెళ్లే ప్రయాణికులు కస్టమ్స్ క్లియరెన్స్ అవసరం లేని వస్తువులు తీసుకెళ్తుంటారు. అదే రెడ్ ఛానల్‌లో వస్తువులను కస్టమ్స్ అధికారులు చెక్ చేసి, సుంకాలు చెల్లించిన తర్వాతే వాటిని బయటకు వదులుతారు. ఇక బంగారం స్మగ్లింగ్ కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. స్మగ్లింగ్‌లో ఆమెతో సంబంధమున్న వ్యక్తులను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె వివాహానికి సంబంధించిన వీడియోలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. రన్యారావు నివాసం, ఆమెకు సంబంధించిన ప్రాంతాలు, నటి వివాహం చేసుకున్న హోటల్‌కు వెళ్లి దర్యాప్తు చేపట్టారు. ఈ వేడుకకు హాజరైనవారు, అతిథులు తీసుకొచ్చిన ఖరీదైన కానుకలపై దృష్టిసారిస్తున్నారు. అందుకోసం పెళ్లికి సంబంధించిన వీడియోను పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. స్మగ్లింగ్ చేసే సమయంలో ఎయిర్‌పోర్టులో వీఐపీ ప్రొటోకాల్‌ను దుర్వినియోగం చేసినట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై విచారణ జరపాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. భద్రతా తనిఖీలను తప్పించుకునేందుకు ఆమె సవతి తండ్రి, సీనియర్ ఐపీఎస్ అధికారి కె.రామచంద్రరావు పేరును ఉపయోగించుకున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ట్రంప్ కోతల ఎఫెక్ట్.. ఈసారి విద్యాశాఖపై



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి ప్రభుత్వ వ్యయం తగ్గింపుపై దృష్టిపెట్టారు. అందులోభాగంగా పలు కీలక విభాగాల్లో కోతలు ప్రకటించారు. ఈ క్రమంలో విద్యాశాఖలోని సిబ్బందిని సగానికి తొలగించే ప్రయత్నాల్లో ఉన్నామని ప్రభుత్వం తెలిపింది. దీనిలోభాగంగా విద్యాశాఖ మంత్రిగా లిండా మెక్‌మాన్ బాధ్యతలు స్వీకరించిన ఐదు రోజుల్లోనే సిబ్బంది తొలగింపునకు సిద్ధమయ్యారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. "ట్రంప్ నాకు ఇచ్చిన ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. విద్యాశాఖను మూసివేసేందుకు మేం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాల్సి ఉంటుందని తెలుసు. కానీ ఇప్పుడు తీసుకున్న నిర్ణయం అవసరానికి మించి ఉన్నవారిపై కత్తెర వేయడం కిందికే వస్తుంది" అని లిండా పేర్కొన్నారు. అమెరికా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తానని అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. విద్యాశాఖను తొలగించి, దానిని రాష్ట్రాలకు అప్పగిస్తానని చెప్పారు. ట్రంప్ బాధ్యతలు స్వీకరించే నాటికి విద్యాశాఖలో 4100 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో 600 మంది స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయడానికి ముందుకొచ్చారు. ఇదిలాఉంటే.. కాలేజీలు, స్కూళ్లు, యూనివర్సిటీలకు ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. వాటికి నిధులు నిలిపివేస్తామని స్పష్టంచేశారు. "చట్టవిరుద్ధ నిరసనలను అనుమతించే కాలేజీ, స్కూల్ లేదా యూనివర్సిటీలకు అన్ని ఫెడరల్ నిధులు నిలిపివేస్తా. ఆందోళనకారులను జైలుకు లేదా వారి స్వదేశానికి పంపించడం జరుగుతుంది. అమెరికా విద్యార్థులైతే శాశ్వత బహిష్కరణ లేదా కేసు తీవ్రతను బట్టి అరెస్టు ఉంటుంది. ఇందులో ఎటువంటి దాపరికం లేదు. ఈ విషయంపై దృష్టిపెట్టినందుకు ధన్యవాదాలు" అని హెచ్చరించారు.

## తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగాలకు

# తమిళం తప్పనిసరి


### మద్రాస్ హైకోర్టు



**చెన్నై :** కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా సూత్రం అమలును రాష్ట్రంలోని రాజకీయ, సినీ ప్రముఖులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో తమిళ భాషలో నిర్వహించిన పరీక్షలో విఫలమైనందుకు తనను తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డు ఉద్యోగం నుంచి తొలగించిందని ఆరోపిస్తూ ఎం.జయ కుమార్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించాడు. తన తండ్రి నావికాదళంలో పని చేస్తుండడం వల్ల తాను సీబీఎస్ఈ పాఠశాలల్లో చదివానని.. అందువల్ల తమిళం నేర్చుకోవడానికి వీలుపడలేదని పేర్కొన్నాడు. కాగా న్యాయస్థానం అతడి పిటిషన్‌ను తోసిపుచ్చింది. తమిళనాడు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించే అభ్యర్థులు తప్పనిసరిగా తమిళం రాయడం, చదవడం నేర్చుకోవాలని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగాలకు తమిళం తప్పనిసరి అని న్యాయస్థానం పేర్కొంది. ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండి పని చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులకు మాతృభాష అయిన తమిళం తెలియకపోతే రోజూవారీ పనులను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించింది. ఏ రాష్ట్రంలో అయినా ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర భాష వచ్చి ఉండాలని లేకపోతే వారు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించలేరని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తంచేసింది. ఈ కేసును ఆరు నెలలపాటు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో భాషా యుద్ధం తీవ్రమవుతున్న సమయంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టంచేస్తోంది. తమిళభాషకు, రాష్ట్రానికి, ప్రజలకు నష్టం కలిగించే చర్యలను అనుమతించబోమని స్టాలిన్ పేర్కొన్నారు. దీనిపై గత కొన్ని రోజులుగా కేంద్రం, తమిళనాడు రాష్ట్రానికి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.

# టార్గెట్ జాఫర్ ఎక్స్‌ప్రెస్

### ఏళ్ల నుంచి మిలిటెంట్ల లక్ష్యం..



**బోలాన్ :** పాకిస్థాన్‌లో హైజాక్‌కు గురైన జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కు కొన్నేళ్లుగా ముప్పు పొంచిఉంది. బలోచ్ రెబల్స్, తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) గ్రూప్ ఈ రైలును లక్ష్యంగా చేసుకొన్నాయి. దీనికి చాలా వ్యూహాత్మక కారణాలున్నాయి. ఈ రైల్లో తరచూ సైనిక దళాలను క్వెట్టా నుంచి పంజాబ్‌కు తరలిస్తుంటారు. దీంతో మిలిటెంట్ గ్రూప్‌లకు ఇది హాట్ టార్గెట్‌గా మారింది. 2018, 2023లో పలుమార్లు దీనిని లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారు. 2018లో పంజాబ్ వెళుతున్న రైలుకు అత్యంత సమీపంలో రెండు బాంబులు పేలాయి. బలోచ్ రెబల్స్ రిమోట్ కంట్రోల్ సాయంతో ఈ దాడికి పాల్పడ్డారు. నాడు ప్రమాదం నుంచి ఇది బయటపడింది. 2023 జనవరి 19న రైల్లో బాంబుపేలి 13 మంది గాయపడ్డారు. క్వెట్టాకు 150 కిలోమీటర్ల దూరంలోని బొలాన్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. నెల రోజుల తర్వాత అదే రైలు క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతుండగా బాంబుపేలుడు జరిగింది. దీనిలో ఒకరు మరణించారు. ఇక గతేడాది క్వెట్టా రైల్వే స్టేషన్‌లో పేలుడు జరిగి 26మంది ప్రాణాలు కోల్పోయారు.

### 155 మంది బందీలను విడిపించిన భద్రతా దళాలు..

తాజాగా పాక్‌లోని బోలన్ జిల్లాలో హైజాక్‌కు గురైన జాఫర్ ఎక్స్‌ప్రెస్ నుంచి 155 మంది బందీలను భద్రతా దళాలు సురక్షితంగా కాపాడాయి. ఈ క్రమంలో 27 మంది వేర్పాటువాదులను మట్టుబెట్టాయి. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది. రైల్లోని తొమ్మిది బోగీల్లో 400 మంది ప్రయాణికులున్నారు. ఈ రైలు క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకొంది. రైల్లో ఉన్న బలోచ్ మిలిటెంట్లు చిన్న బృందాలుగా విడిపోయి ఉండటంతో.. ఆపరేషన్ కష్టతరంగా మారినట్లు భద్రతా వర్గాలు చెబుతున్నాయి.

### ఐడీ కార్డులు చెక్‌చేసి మరీ..

జాఫర్ ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రాణాలతో బయటపడిన బందీలు తమ భయానక అనుభవాలను పంచుకొన్నారు. తొలుత భారీ పేలుళ్లు వినిపించాయని.. ఆ తర్వాత కొంతసేపు కాల్పులు జరిగాయని అల్లాదిత్తా అనే ప్రయాణికుడు చెప్పాడు. దీంతో ప్రయాణికులు ప్రాణాలు కాపాడుకొనేందుకు సీట్ల కింద తల దాచుకొన్నారన్నారు. మిలిటెంట్లు మహిళలు, పురుషులను వేర్వేరుగా ఉంచారు. తాను హృద్రోగినని అని చెప్పడంతో తన కుటుంబాన్ని వదిలేశారని అతడు పేర్కొన్నాడు. ఇక రైల్లోకి మిలిటెంట్లు ప్రవేశించిన వెంటనే ప్రయాణికుల ఐడీ కార్డులను చెక్ చేశారు. సైన్యం, భద్రతా దళాల్లో పనిచేసే వారిని గుర్తించి వేరు చేశారు. ఇద్దరిని తమ ముందే కాల్చేశారని ఓ ప్రయాణికుడు వెల్లడించాడు. మరో నలుగురిని తీసుకెళ్లారన్నారు. వీరితోపాటు పంజాబ్ ప్రాంతం వారిని కూడా బందీలుగా పట్టుకొన్నట్లు వెల్లడించాడు. సైన్యం కిడ్నాప్ చేసిన రాజకీయ ఖైదీలు, ఉద్యమకారులు, అదృశ్యమైన వ్యక్తులను 48 గంటల్లోగా విడిచిపెట్టాలని బలోచ్ లిబరేషన్ ఆర్మీ డిమాండ్ చేస్తోంది. లేకపోతే తమ బందీలుగా ఉన్న వారిని చంపేస్తామని బెదిరిస్తోంది. అంతేకాదు.. రైలును

# మా నుంచి మారిషస్‌కు గిఫ్ట్ ఇదే

### ప్రధాని మోదీ



**పోర్ట్ లూయిూ:** మారిషస్ తమకు కీలక భాగస్వామి అని భారత ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అలాగే 140 కోట్ల మంది భారతీయుల తరఫున మారిషస్ ప్రజలకు నేషనల్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. "నేషనల్ డే రోజున మరోసారి మీముందు ఉండటం నా అదృష్టం. మన రెండు దేశాలను అనుసంధానించేది హిందూ మహాసముద్రం మాత్రమే కాదు. సంస్కృతి, సంప్రదాయాలు మనల్ని కలిపి ఉంచుతున్నాయి. ఈ రెండు దేశాల బంధాన్ని 'మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్య' హోదాకు తీసుకెళ్లాలని ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం, నేను నిర్ణయించాం. మారిషస్‌లో కొత్త పార్లమెంట్ భవన నిర్మాణానికి భారత్ సహకరించనుంది. ప్రజాస్వామ్యానికి తల్లి వంటి భారత్ నుంచి మారిషస్‌కు ఇదొక కానుకగా భావిస్తున్నాం" అని మోదీ అన్నారు. "పది సంవత్సరాల క్రితం 'సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ది రీజియన్'కు మారిషస్ నుంచే పునాది వేశాం. ఈ ప్రాంత శ్రేయస్సు, స్థిరత్వం కోసం సాగర్ విజన్‌తో ముందుకొచ్చాం. గ్లోబల్ సౌత్ దేశాల కోసం మహాసాగర్ విజన్‌ను ప్రకటిస్తున్నాం. వాణిజ్యం, పరస్పర భద్రత అంశాలపై దానికింద పనిచేస్తాం" అని మోదీ వెల్లడించారు. ఈ ప్రాంతంలో చైనా తన ప్రభావాన్ని విస్తరించేందుకు చేస్తోన్న ప్రయత్నాల నేపథ్యంలో ఈ మహాసాగర్ ప్రకటన వచ్చింది. నవీన్‌చంద్ర రామ్‌గులాం మాట్లాడుతూ.. "నేషనల్ డే వేడుకల్లో భాగంగా ప్రధాని మోదీ మా దేశంలో పర్యటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాం. ఆయన రాక రెండు దేశాల బంధానికి నిదర్శనం" అని అన్నారు. ఇద్దరు ప్రధానుల భేటీ అనంతరం ఈమేరకు సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశం అనంతరం పోర్ట్ లూయిూలోని చాంప్ డి మార్స్ వద్ద మారిషస్ నేషనల్ డే వేడుకల్లో ముఖ్యఅతిథిగా మోదీ పాల్గొన్నారు. ఆ వేడుకలు వీక్షించేందుకు అక్కడికి వచ్చిన పలువురు ప్రజలు జైశ్రీరామ్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ ఈవెంట్‌లో ఐఎన్ఎస్ ఇంఫాల్, నౌకాదళానికి చెందిన హెలికాప్టర్, నౌకాదళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


# రన్యారావును నిద్ర పోనివ్వడం లేదు

### కోర్టులో న్యాయవాది వాదనలు

**బెంగళూరు:** బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు అధికారుల కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె బెయిల్ కోసం ప్రత్యేక కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే నటి తరఫు న్యాయవాది కీలక విషయాలను కోర్టుకు వెల్లడించారు. విచారణ పేరుతో డీఆర్ఐ అధికారులు ఆమెను నిద్ర పోనివ్వడం లేదని న్యాయవాది తెలిపారు. అరెస్టయిన సమయంలో తనకు ఉన్న హక్కుల గురించి ఆమెకు పూర్తిగా తెలియదని కోర్టులో వాదించారు. విమానాశ్రయం వద్ద రన్యారావును డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకునే సమయంలో ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరిగాయని పేర్కొన్నారు. అధికారులకు ఆమె ఇచ్చిన వాగ్మూలం తను స్వతహాగా ఇచ్చింది కాదని వాదించారు. విచారణ పేరుతో ఆమెను సరిగా నిద్ర పోనివ్వడం లేదని తెలిపారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని తన క్లయింట్‌కు బెయిల్ మంజూరుచేయాల్సిందిగా కోర్టును కోరారు.

## అమెరికా వస్తువులపై

# ఐరోపా ప్రతీకార సుంకాలు



**ఐరోపా :** అమెరికా టారిఫ్‌లకు ఐరోపా సమాఖ్య తీవ్రంగా తీవ్రంగా స్పందించింది. వాషింగ్టన్‌కు చెందిన 28.33 బిలియన్ డాలర్ల వస్తువులపై తాము ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు ఐరోపా కమిషన్ ప్రకటించింది. స్టీల్, అల్యూమినియమ్‌పై విధించిన సుంకాలకు ప్రతిగా ఈ నిర్ణయం తీసుకొంది. ఇప్పటివరకు అమెరికా ఉత్పత్తులపై ఉన్న టారిఫ్‌ల సస్పెన్షన్‌ను ఏప్రిల్ 1 నుంచి తొలగిస్తున్నట్లు ఈయూ కమిషన్ వెల్లడించింది. దీంతోపాటు అమెరికా వస్తువులపై మరిన్ని చర్యలు తీసుకొంటామని చెప్పింది. ఈ చర్యలు అమెరికా నిర్ణయానికి సరిపోతాయని వెల్లడించింది. "మా ప్రతిఘటన చర్యలు రెండు దశల్లో అమలవుతాయి. ఏప్రిల్ 1వ తేదీన మొదలై.. 13వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తాయి. అర్థవంతమైన చర్చలకు సిద్ధమే. దీనికి సంబంధించిన బాధ్యతలను ట్రేడ్ కమిషనర్ మారోస్ సెఫ్కోవిక్‌కు అప్పగించాను. వారు అమెరికాతో చర్చలు జరిపి మెరుగైన పరిష్కారం కనుగొంటారు" అని ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ వెల్లడించారు. సుంకాలు వ్యాపారానికి, వినియోగదారులకు చాలా నష్టదాయకమని ఆమె అభిప్రాయపడ్డారు. అమెరికా, ఐరోపాలో ధరలు పెరిగిపోతాయన్నారు. వినియోగదారులు, వ్యాపారులను రక్షించేందుకు ఈయూ కచ్చితంగా చర్యలు తీసుకోవాలి. మరోవైపు యూకే కూడా అమెరికా చర్యలకు తగిన సమాధానం ఇవ్వాలని ఎదురుచూస్తోంది. ఆ దేశ వాణిజ్య మంత్రి జోనాథన్ రేనోల్డ్స్ స్పందిస్తూ.. తమ ఎదుట ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇక ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ అమెరికా నిర్ణయంపై స్పందిస్తూ నిరాశ వ్యక్తంచేశారు. ఇది పూర్తిగా అహేతుకమని వ్యాఖ్యానించారు. తాము మాత్రం ప్రతీకార సుంకాలు విధించమని వెల్లడించారు. అదే సమయంలో అమెరికా నుంచి మినహాయింపులు పొందేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25శాతం సుంకాలను విధిస్తున్నామని ఫిబ్రవరిలో ట్రంప్ ప్రకటించారు. అవి నేటినుంచి అమల్లోకి వచ్చాయి. ఈ చర్యలను ది అమెరికన్ ఐరన్ అండ్ స్టీల్ ఇన్‌స్టిట్యూట్ స్వాగతించింది. దేశీయంగా ఈ నిర్ణయంతో సరికొత్త ఉద్యోగాలు పుడతాయని పేర్కొంది.

## కెనడాపై డబుల్ సుంకాల విషయంలో

# ట్రంప్ రివర్స్ గేర్




అమెరికా, కెనడాల మధ్య పరస్పర సుంకాల యుద్ధం కొనసాగుతోంది. అమెరికాకు సరఫరా చేసే విద్యుత్‌పై 25 శాతం అదనపు రుసుం వసూలు చేస్తామని ఆంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ పేర్కొనడంతో.. కెనడాకు చెందిన ఉక్కు, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిన్న ప్రకటించారు. తాజాగా ఈ పెంపును ఆయన తాత్కాలికంగా నిలిపివేశారు. అమెరికాలోని పలు రాష్ట్రాలపై విద్యుత్ ధరల పెంపును కెనడా ఉపసంహరించుకున్న నేపథ్యంలో సుంకాలపై ట్రంప్ వెనక్కి తగ్గుతున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాపై 25 శాతం టారిఫ్ విధించిన విషయం తెలిసిందే. దీంతో అమెరికాలోని మూడు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న విద్యుత్‌పై ఎగుమతి సుంకాలను 25శాతం పెంచుతున్నట్లు కెనడాలోని ఒంటారియో ప్రకటించింది. దానికి ప్రతీకారంగా కెనడాకు చెందిన ఉక్కు, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు తాజాగా ప్రకటించారు. కాగా యుఎస్ వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్‌తో చర్చల అనంతరం విద్యుత్‌పై 25 శాతం అదనపు రుసుం వసూలుచేయాలనే ప్రణాళికను విరమించుకున్నట్లు ఒంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ వెల్లడించారు. ఈ విషయంలో ఇరువర్గాల ప్రయోజనాలపై అమెరికాతో చర్చలు జరపడానికి ఫెడరల్ ఆర్థిక మంత్రి డొమినిక్ లెబ్లాంక్‌తో కలిసి గురువారం వాషింగ్టన్ వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. అమెరికా దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25శాతం సుంకాలను విధిస్తున్నామని ట్రంప్ ప్రకటించారు. కెనడా, మెక్సికో సహా ప్రపంచ దేశాలన్నింటికీ ఇది వర్తిస్తుందని ప్రకటించారు. దీనిపై ఆదేశాలిస్తానని తెలిపారు. మరిన్ని రంగాల్లోనూ సుంకాలను ప్రకటిస్తామని వెల్లడించారు. 'వారు మన ఉత్పత్తులపై 130శాతం సుంకాలు విధిస్తుంటే మనం ఏమీ విధించకపోవడం సరికాదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ సుంకాల ప్రకటనతో అంతర్జాతీయ వాణిజ్య భాగస్వామ్య సంస్థల్లో ఆందోళన నెలకొంది.



## అమెరికా బెదిరించినా

# చర్చలు కుదరవ్ : ఇరాన్

అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా తాము అగ్రరాజ్యంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా లేమని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అక్కడి మీడియాలో కథనాలు వెల్లడిస్తున్నాయి. వాటి ప్రకారం.. 'అమెరికా ఆదేశాలు ఇవ్వడం, బెదిరించడం ఆమోదయోగ్యం కాదు. ట్రంప్‌తో చర్చలు చేపట్టే ఉద్దేశం నాకు లేదు. ఆయనకు ఇష్టమొచ్చింది చేసుకోవచ్చు' అని పెజెష్కియాన్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోవడాన్ని నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఇదే అంశంపై ఇటీవల మాట్లాడిన ట్రంప్.. టెహ్రాన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈమేరకు ఖమేనీకి లేఖ రాసినట్లు ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఇరాన్‌కు సైన్యం, ఒప్పందం అనే రెండు మార్గాలను సూచించారు. అయితే, తాను ఒప్పందానికే ప్రాధాన్యం ఇస్తానని, టెహ్రాన్‌ను దెబ్బతీయడం ఇష్టం లేదని స్పష్టంచేశారు. ఇక, ట్రంప్ ప్రతిపాదనపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ఇటీవల స్పందించారు. అమెరికా చర్చలు సమస్యల పరిష్కారం కంటే ఆధిపత్యమే లక్ష్యంగా ఉంటాయని విమర్శించారు. టెహ్రాన్‌ను ఎదురించలేక.. ట్రంప్ చర్చలు అనే కొత్త వ్యూహాలు నెలకొల్పుతున్నారని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో గతంలో అణు ఒప్పందం చేసుకున్న అమెరికా.. 2018లో ట్రంప్ హయాంలోనే దాన్నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.




# ప్రధాని మోడీకి ప్రత్యామ్నాయం ఏదీ!

దేశ రాజకీయాల్లో ఇప్పుడు నిస్తేజం ఆవరించింది. బిజెపిని ఢీకొనేందుకు ఏర్పడ్డ ఇండియా కూటమి షెడ్డుకు చేరింది. కూటమిగా పనిచేసేందుకు అందులోని పార్టీలు ముందుకు రావడం లేదు. ఎవరికి వారే యమునాతీరే అన్నచందంగా పార్టీల వ్యవహారం సాగుతోంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ నిర్మానాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందన్న నమ్మకం కుదరడం లేదు. టిఎంసి,డిఎంకె పార్టీలు పార్లమెంటులో సొంత ఎజెండాతో పోతున్నాయి. వాటికి అవసరమైన మేరకు ఆందోళన చేస్తున్నాయి. డిఎంకె జాతీయ విద్యావిధానం, హిందీ వ్యతిరేకతపైనే రాజకీయాలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అవతకవలు, ఓటరల జాబితాపై పోరాడుతోంది. మొత్తంగా అన్ని పార్టీల్లోనూ సొంత ఎజెండాలే తప్ప ప్రజల ఎజెండా కానరావడం లేదు. పార్లమెంటులో ప్రజల పక్షాన నిలిచామని చెప్పుకోవడానికి ఈ పార్టీలు పనిచేయలేక పోతున్నాయి. రెండోదఫా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన అంశాలపై నిలదీసే కార్యక్రమంకానరావడం లేదు. నాయకుడిగా రాహుల్ ఇంకా పరిణతి చెందలేదు. పార్టీ పెత్తనాన్ని అట్టిపెట్టుకోవడం మినహా దేశాన్ని నడిపించే సత్తా ఉందని నిరూపించుకోలేక పోతున్నారు. రాహుల్‌తో పోలిస్తే ప్రియాంక కొంత చు-రుకుగా ఉంటున్నారు. ఇకపోతే ఢిల్లీ ఎన్నికల ఫలితాల తరవాత ఆప్ ఓటమితో..ప్రత్యామ్నాయ రాజకీయాలకు గండిపడింది. ఆప్ అవినీతి కారణంగా ప్రజలు ఇతర పార్టీలను నమ్మే విధంగా లేరు. దీంతో బిజెపికి తీరుగులదేన్న విధంగా పరిస్థితి మారుతోంది. డబుల్ ఇంజన్ అంటూ మోడీ చేసిన ప్రచారం బాగా పనిచేసిందనే చెప్పాలి. అలాగే మోడీ కాంగ్రెస్ ముక్త భారత్ నినాదానికి మరింత బలం చేకూరింది. మోడీ నాయకత్వానికి తిరుగులేదని నిరూపితం అయ్యింది. బిజెపియే దేశానికి రక్ష అన్న వాదనకు కూడా బలం చేకూరింది. ఇదే సందర్భంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు అంటూ బయలుదేరిన పార్టీలకు ఈ ఫలితాలు ఎదురుదెబ్బగానే భావించాలి. ప్రత్యమ్నాయ రాజకీయాలకు పెద్దగా అనుకూలం కాదని తేలింది. కాంగ్రెస్ కుటుంబ రాజకీయాలను ప్రజలు ఆమోదించడం లేదని వరుస పరిణామాలు రుజువు చేశాయి. అలాగే కాంగ్రెస్ నాయకత్వం మారాల్సిన అవసరాన్ని గుర్తించాలి. రాహుల్, ప్రియాంకలు కాంగ్రెస్ నావను గట్టెక్కించలేరని కూడా తేలిపోయింది. మోడీ ఛరిష్మా తగ్గలేదని కూడా ఢిల్లీ ఫలితాలు మరోమారు రుజువు చేస్తున్నాయి. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటూ మోడీ చేసిన ప్రచారం ప్రజలను ఆలోచింపచేసిందనే చెప్పాలి. ఇకపోతే సంప్రదాయ ఓటు అన్నదానికి అర్థం లేకుండా పోతోంది. ఓటర్లు కూడా ఎప్పటికప్పుడు మారుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఫలానా పార్టీకే అంటిపెట్టుకుని ఓటర్లు ఉండడం లేదు. మోడీకి ప్రత్యామ్నాయ నేతగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆవిర్భవించినట్లు ప్రచారం జరిగినా..అవినీతి మరకలు అతడిని అథఃపాతాళానికి తొక్కేశాయి. ఢిల్లీలో రెండుసార్లు అధికారం నిలుపుకోవడంతో పాటు పంజాబ్‌లో అధికారం చేపట్టడంతో తనకు తిరులేదని భావించారు. ప్రధాని పదవిపై కన్నేసి అడ్డమైన గడ్డి తిన్నారు. మోడీకి తానే ప్రత్యామ్నాయం అనుకుని కేజ్రీవాల్ విర్రవీగారు. ఈ క్రమంలో నీచరాజకీయాలకు లోనయ్యారు. ఇక యూపిని తీసుకుంటే యోగి పాలనా దక్షతకు తోడు మోడీ డబుల్ ఇంజిన్ ప్రచారం బాగా పనిచేసింది. యూపిలో వరుసగా రెండోసారి అధికారం నిలుపుకోవడం కూడా బిజెపికి ఓ చరిత్రగా చూడాలి. యూపి ఫలితాలను విశ్లేషించుకుంటే ఎస్పీ బలం పుంజుకుంది. తొలిసారి వంద సీట్లను దాటింది. ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. బిఎస్పీతో పాటు కాంగ్రెస్ కూడా యూపిలో పూర్తిగా తుడిచిపెట్టుకుని పోయే పరిస్థితి ఏర్పడింది. అక్కడ రాహుల్,ప్రియాంకల ప్రచారం ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. ఇందిరతో ప్రియాంకను పోలుస్తూ ఇటీవల దేశంలో పెద్ద ఎత్తున ప్రచారం సాగినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. బిజెపి పట్ల ప్రజలు ఇంకా విశ్వాసంతోనే ఉన్నారు. దీనికి ప్రధాన కారణం అవినీతి రహిత పాలన కూడా బాగా పనిచేసిందనే చెప్పాలి. దేశ ప్రయోజనాలను కూడా ప్రజలు ఆశిస్తున్నారు. ఆలాగే ప్రత్యామ్నాయ రాజకీయాలకు అడుగు పడుతుందా అన్నది కూడా ఇప్పుడు అనుమానంగా మారింది. కాంగ్రెస్ తాను గిరిగీసుకున్న చట్రం నుంచి బయటపడాలి. తనను తాను సంస్కరించుకోవాలి. ప్రజాపోరాటాలతో రాటుదేలాలి. కేవలం ఒక్కటంటే ఒక్క పాదయాత్ర చేసి ఇక అంతా అయ్యిందన్న ధీమాలో రాహుల్ ఉన్నారు. అలా అనుకుంటే పొరపాటు. ప్రజలు కాంగ్రెస్‌కే ఎందుకు ఓటేయాలన్న ఆలోచన కలిగించగలగాలి. గతంలో తెలంగాణ సిఎంగా ఉన్న సమయంలో కెసిఆర్ కూడా గుణాత్మక రాజకీయాలు అంటూ బయలు దేరారు. ఆయనకు మమతా బెనర్జీ, ఉద్ధవ్ థాక్రే, స్టాలిన్ లాంటి నేతలు మద్దతు పలికారు. పికె లాంటి వారు వ్యూహాలు పన్నారు. ఫలితాలు బిజెపికి వ్యతిరేకంగా వస్తాయిన అంతా ఆశించారు. కానీ ఇప్పుడు కెసిఆర్ ఫామ్ హౌజ్‌కే పరిమితం అయ్యారు. తెలంగాణలో అధికారం కోల్పోవడంతో ఆయన చురుకైన పాత్ర పోషించడం లేదు. మోడీని నిలువ రించేందుకు ప్రతిపక్షాలను ఐక్యం చేయాలన్న సంకల్పంలో ఇప్పుడు రాజకీయంగా శూన్యం ఏర్పడిందనే చెప్పాలి. ఎందుకంటే మోడీ వ్యూహాల ముందు అంతా దిగదుడుపే అని తేలిపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలను కుటుంబం నుంచి తప్పిస్తే తప్ప దానిని ముందుకు తీసుఉకుని వెళ్లడం సాధ్యం కాదు. ఆయా రాష్ట్రాల్లో బిజెపి అధికారం నిలబెట్టు కోవడమన్నది బిజెపికి కలసివచ్చే అంశగా చూడాలి. అలాగే మోడీ, అమిత్ షాల ఉమ్మడి నాయకత్వం పట్ల ప్రజల విశ్వాసం చెదరలేదని, వారికి తిరుగులేదని కూడా చెప్పుకో వచ్చు. ఇదే సందర్భంలో ప్రాంతీయ పార్టీలకు ప్రత్యమ్నాయం కూడా అంత సులభం కాదని కూడా గుర్తించాలి.

# పాక్‌లో రైలు హైజాక్ కేసు

## 30మంది మిలిటెంట్లను హతమార్చిన బలగాలు




**లాహోర్, మార్చి 12 :** పాకిస్థాన్‌లో రైలు హైజాక్ ఘటనలో బలోచ్ వేర్పాటువాదుల చెర నుంచి దాదాపు 190 మంది ప్రయాణికులను భద్రతాబలగాలు రక్షించాయి. అలాగే 30 మంది మిలిటెంట్లను మట్టుపెట్టాయని స్థానిక వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అయితే మిలిటెంట్లు ఐదు వేర్వేరు ప్రాంతాల్లో 200 మందిని బంధించినట్లు పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బలోచిస్థాన్ ప్రావిన్సులోని పర్వతప్రాంతమైన క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని పెషావర్‌కు జాఫర్ ఎక్స్‌ప్రెస్ (ఏజౌజీస ఇలూసఃబబ) వెళ్తున్న సమయంలో ఈ హైజాక్ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. రైల్లోని తొమ్మిది బోగీల్లో 400 మంది ప్రయాణికులున్నారు. అలాగే రైల్లో ఉన్న బలోచ్ మిలిటెంట్లు చిన్న బృందాలుగా విడిపోయి ఉండటంతో.. ఆపరేషన్ కష్టతరంగా మారినట్లు భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే.. బలోచ్ తిరుగుబాటుదారులు అఎ÷-గానిస్థాన్‌లోని తమ కీలక నేతతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించారు. హైజాక్‌లో మొత్తం 70 నుంచి 80 మంది వేర్పాటువాదులు పాల్గొన్నారంటూ మీడియాతో మాట్లాడారు. ఈ ఘటన నేపథ్యంలో బలోచిస్థాన్‌కు రాకపోకలు సాగించే అన్ని రైళ్లను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. సైన్యం కిడ్నాప్ చేసిన రాజకీయ ఖైదీలు, ఉద్యమకారులు, అదృశ్యమైన వ్యక్తులను 48 గంటల్లోగా విడిచిపెట్టాలని బలోచ్ లిబరేషన్ ఆర్మీ డిమాండ్ చేస్తోంది. లేకపోతే తమ బందీలుగా ఉన్న వారిని చంపేస్తామని బెదిరిస్తోంది. అంతేకాదు.. రైలును కూడా ధ్వంసం చేస్తామని చెబుతోంది.

# ముడి ఉక్కు ఉత్పత్తిలో రెండవ పెద్ద దేశంగా భారత్

## కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు




**న్యూఢిల్లీ,మార్చి12:** ముడి ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలో భారతదేశం రెండవ అతిపెద్ద దేశంగా అవతరించడం ఆనందంగా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన నూతన స్టీల్ సెక్టార్‌లో పరిశోధన, అభివృద్ధి, స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఆర్టీఎంఐ) వెబ్-పోర్టల్‌లో స్టీల్ కొల్లాబ్ ప్లాట్ ఫారాంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ.. స్టీల్ పరిశ్రమ రంగంలో సాధించిన అభివృద్ధి గురించి చర్చించడం ఆనందంగా ఉందన్నారు. నూతన స్టీల్ సెక్టార్‌లో ఎస్ఆర్టీఎంఐ వెబ్-పోర్టల్‌లో స్టీల్ కొల్లాబ్ ప్లాట్‌ఫారాంను విజయవంతంగా ప్రారంభించడం ద్వారా ఉక్కు తయారీలో నూతన ఆవిష్కరణలు, స్థిరత్వం, సాంకేతిక పురోగతిని ప్రోత్సహించడానికి ప్రధాన మోడీ నాయకత్వంలో బలమైన పునాదిని వేశామని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. అయితే, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఉక్కు డిమాండ్ తో జీడీపీ వృద్ధిని అధిగమించింది.. ఇది ఆర్థికాభివృద్ధిలో కీలకమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. స్టీల్ రంగ వృద్ధిలో స్థిరత్వాన్ని సాధించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కింద ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాలు ఈ రంగం అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఎస్ఆర్టీఎంఐ వెబ్ సైట్ ద్వారా ఆసక్తిగల వాటాదారులను, ఈ రంగం అభివృద్ధికి సహకరించడానికి ఆహ్వానిస్తుండటంతో పాటు నూతనంగా ప్రారంభించిన మూడు ఆర్అండ్ డీ పథకాలు స్టీల్ రంగ అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని శ్రీనివాస వర్మ చెప్పుకొచ్చారు.

# సీఎంపై అనుచిత వ్యాఖ్యలు

## ఇద్దరు మహిళ జర్నలిస్టుల అరెస్ట్

**హైదరాబాద్, మార్చి 12:** సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన ఇద్దరు యూట్యూబర్లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను సైబర్ క్రైమ్ అదనపు సీపీ విశ్వ ప్రసాద్ మీడియాకు వివరించారు. నిప్పు కోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో రేవంత్ రెడ్డిని తిడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ ఫిర్యాదు చేశారు. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తు తెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేశారు. అందులో మాట్లాడిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పల్స్ టీవీ ఉద్దేశపూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించిందని దర్యాప్తులో గుర్తించామని విశ్వప్రసాద్ అన్నారు. పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను నిప్పుకోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేశారు. బీఆర్ఎస్ కార్యాలయంలో ఓ వ్యక్తిని ఉద్దేశ్యపూర్వకంగా ఇంటర్వ్యూ చేస్తూ రేవంత్ రెడ్డిను అసభ్యకర వ్యాఖ్యలతో దూషించేలా చేశారని పోలీసులు గుర్తించారు. ఆ వీడియో గత నెలలో రికార్డు చేసినా అసెంబ్లీ సమావేశాలకు 2రోజుల ముందు టెలికాస్ట్ చేశారని తెలిపారు. ఈ వీడియోను నిప్పు కోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో వైరల్ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇన్సెటివ్స్ తీసుకుని మరీ ట్రోల్ చేస్తున్నట్లు తెలిపారు. సెక్షన్ 67 ఐటీ యాక్ట్, 111బిఎన్ఎస్, 61(2), 353(2), 352 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మాదాపూర్‌లోని టీవీ కార్యాలయంలో సోదాలు నిర్వహించి 2 ల్యాప్ టాప్‌లు, 2 హార్డ్ డిస్కులు, లోగో, రూటర్, 7 సీపీయూలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. రేవతిపై గతంలో ఎల్‌బీనగర్, బంజారాహిల్స్‌లో కేసులు ఉన్నాయని వివరించారు. అరెస్ట్ చేసిన ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్ గూడ జైలుకు తరలించారు.

## త్రిభాషా సూత్రం


# ముమ్మాటికీ సమ్మతమే

## ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత మంచిది.. ఎంపీ సుధామూర్తి స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,మార్చి12 :** జాతీయ విద్యా విధానంలో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య తీవ్ర వివాదం కొనసాగుతున్న తరుణంలో రాజ్యసభ ఎంపి సుధామూర్తి ఎన్ఇపికి మద్దతు పలికారు. భాషలు నేర్చుకోవడంలో తప్పులేదన్నారు. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనూ దీనిపై ఎంపీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ, ప్రముఖ వితరణశీలి సుధామూర్తి దీనిపై మాట్లాడుతూ.. త్రిభాషా సూత్రానికి మద్దతు పలికారు. ఎక్కువ భాషలు నేర్చుకోవడం పిల్లలకే మంచిదన్నారు. 'ఒక వ్యక్తి అనేక భాషలు నేర్చుకోవాలని సూచిస్తాను. నాకు 7-8 భాషలు వచ్చు. నేర్చుకోవడాన్ని నేను చాలా ఇష్టపడతా. పిల్లలు కూడా దీని వల్ల మంచి ప్రయోజనాలు పొందుతారు' అని సుధామూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందీ వివాదం వేళ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. త్రిభాషా సూత్రం అమలుపై ప్రతిపక్షాలు, ముఖ్యంగా డీఎంకే పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం దీనిపై మాట్లాడుతూ.. 'ద్విభాషా పద్ధతిపై తమిళనాడు చాలా స్పష్టంగా ఉంది. ప్రపంచ శాస్త్ర, సాంకేతికత, వాణిజ్య విధానాలతో అనుసంధానం కోసం ఆంగ్లం నేర్చుకోవాలి. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం కోసం తమిళం ఉండాలి. ఒకవేళ మూడో భాషను నేర్చుకోవాలంటే అది విద్యార్థుల అభీష్టానికి వదిలేయాలి. అంతేగానీ.. తప్పనిసరి అంటూ బలవంతంగా రుద్దకూడదు. కేంద్రం చర్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం' అని అన్నారు. అయితే, ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తిప్పికొట్టారు. విద్యార్థులు చదువుకునే హక్కును హరించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. విద్యా విధానాల అమలు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# కాలం భగవత్ స్వరూపం



తిరుమల, మార్చి 12 :కాలం భగవంతుని స్వరూపం. ఈ సష్టిలో అత్యంత బలమైనది కాలమే. కాలానికి సమస్త జీవరాశీ వశపడవలసిందే. కాలానికి లొంగకుండా బతకగలిగినది ఈ సష్టిలో ఏదీ లేదు. అందుకే శ్రీ రామాయణంలో కాలం గురించి చెబుతూ...'కాలోహి దురతి క్రమః' అంటారు వాల్మీకి మహర్షి. అంటే ..కాలాన్ని దాటడం, తనకు వశం చేసుకోవడం, దాన్ని కదలకుండా చేయగలగడం... లోకంలోఎవరికీ సాధ్య పడదని. సాధారణ సిద్ధాంతంలో అందరూ కాలానికి వశపడవలసిందే. కాలంలో పుడతారు, కాలంలో పెరుగుతారు, కాలంలోనే శరీరాన్ని విడిచి పెడతారు. అందరూ కాలానికి వశపడి ఉంటారు. కానీ ఎవడు భగవంతుడిచ్చిన జీవితం అనబడే ఈ శరీరంతో ఉండగలిగిన కాలాన్ని సద్వినియోగం చేసుకుంటాడో వాడు తన శరీరాన్ని విడిచి పెట్టేసిన తరువాత కూడా కీర్తి శరీరుడిగా నిలబడిపోతాడు. ఆయనకి కీర్తే శరీరం అవుతుంది. ఆయన కాలంతో సంబంధం లేకుండా యుగాలు దాటిపోయినా కూడా కొన్ని కోట్ల మందికి ప్రేరణగా అలా నిలబడిపోతాడు. అందుకే మనుష్యుని జీవితంలో అన్నిటికన్నా అత్యంత ప్రధానమైనదిగా చెప్పబడేది కాలం విలువను గుర్తించడం. ఆ కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం. ఎవడు కాలం విలువని గుర్తించలేడో ఎవడు కాలాన్ని సద్వినియోగం చేసుకోలేదో వాడు కాలగర్భంలో కలిసిపోతాడు. ఆ జీవితం ఏ విధంగా కూడా ఉపయోగకరం కాదు. తనను తాను ఉద్ధరించుకోవడానికిగానీ, మరొకరిని ఉద్ధరించడానికిగానీ పనికిరాడు.

# టీమ్ ఇండియాపై ప్రశంసలు

## 25 ఏళ్ల నాటి పగకు ప్రతీకారం తీర్చుకున్న భారత్
## సీనియర్ల రాణింపుతో విమర్శకుల నోళ్లకు మూతలు



దుబాయ్ వేదికగా జరిగిన ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ ఫైనల్ పోరులో కివీస్ జట్టును మట్టి కరిపించి ఛాంపియన్స్ ట్రోఫీను మూడోసారి ముద్దాడింది టీమ్ ఇండియా. లీగ్ దశ నుంచి నాకౌట్ వరకు ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా కప్ గెల్చుకుంది. 25 ఏళ్ల నాటి పగకు ప్రతీకారం తీర్చుకున్న టీమ్ ఇండియాను నిశితంగా గమనిస్తే ఓ అరుదైన ఫీట్ సాధించిందని చెప్పాలి. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 చేజిక్కించుకున్న టీమ్ ఇండియాలో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. వయసు మళ్లింది..ఇక రిటైర్మెంట్ అవసరమనే ట్రోలింగ్‌కు చెక్ చెప్పడమే కాకుండా ఆ సీనియర్లే మ్యాచ్‌ను గెలిపించారు. టోర్నీ మొత్తం బౌలర్లతో ఆధిపత్యంగా సాగింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ ఫామ్‌లో రావడమే కాకుండా ముగ్గురూ మూడు నాలుగు సందర్భాల్లో జట్టును ఆదుకున్నారు. ఎంతైనా సీనియార్టీ పనిచేస్తుందని రుజువు చేశారు. అందరి నోళ్లకు మూతలు వేశారు. ఇదంతా ఓ ఎత్తైతే టోర్నీలో ఏ ఇతర జట్టుకు లేని ప్రత్యేకత టీమ్ ఇండియాలో ఉంది. అదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కైవసం చేసుకున్న టీమ్ ఇండియాలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. టీమ్ ఇండియా ప్లేయింగ్ 11లో 10 మంది ఆటగాళ్ల వయస్సు 30 ఏళ్లు దాటి ఉంది. ఐసీసీ టోర్నమెంట్ గెలిచిన ఓల్డ్ టీమ్‌గా భారత జట్టు నిలిచిందని చెప్పవచ్చు. ఎందుకంటే మరే ఇతర జట్టులోనూ ఇంతమంది 30 ఏళ్ల వయస్సు దాటినవాళ్లు లేరు. టీమ్ ఇండియా తరపున ఆడిన ప్లేయింగ్ 11లో పది మంది వయస్సు మూడు పదులు దాటి ఉండటం విశేషం. ఒక్క శుభమన్ గిల్ ఒక్కడే 27 ఏళ్ల వయస్సు కలిగినవాడు. మరో 23 ఏళ్ల హర్షిత్ రాణా ఉన్నాడు కానీ మొదటి మ్యాచ్ తరువాత అతను 33 ఏళ్ల వరుణ్ చక్రవర్తితో రీప్లేస్ అయ్యాడు. ఇక ఈ టోర్నీకు ఎంపికై ఒక్క మ్యాచ్ ఆడని 30 ఏళ్ల వయస్సులోబడి ఉన్నవారిలో రిషభ్ పంత్ , అర్షదీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్ ఉన్నారు. వీరిలో రిషభ్ పంత్ వయస్సు 27 , అర్షదీప్ సింగ్ 26 ఏళ్లు కాగా, వాషింగ్టన్ సుందర్ వయస్సు 25 ఏళ్లు. కానీ ఈ ముగ్గురు ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ ఆడలేదు. ప్లేయింగ్ 11లో ఏకంగా 10 మంది 30 ఏళ్ల వయస్సు దాటినవాళ్లు కావడం గమనార్హం. 30 ఏళ్లు దాటిన ఇంతమంది కలిగిన జట్టు ఐసీసీ టోర్నీ గెలవడం కూడా ఇదే తొలిసారి కావచ్చు. వయస్సు చెప్పుకోడానికే కానీ ఆటకు కాదని నిరూపించారు. అందుకే ఛాంపియన్స్ ట్రోఫీ 2025 గెల్చుకుని ఛాంపియన్స్ అయ్యారు. మూడు పదుల వయస్సు దాటినా వాడి తగ్గలేదని నిరూపించారు.



## ర్యాంకింగ్స్‌లో దూసుకొచ్చిన
# రోహిత్ శర్మ

### మూడో స్థానంలో కొనసాగుతున్న రోహిత్
### అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ర్యాంకింగ్స్ విడుదల

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్?లో టీమ్‌ఇండియా కెప్టెన్ సత్తా చాటాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్?లో అత్యుత్తమ ప్రదర్శన వల్ల రెండు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. ప్రస్తుతం రోహిత్ 756 రేటింగ్స్?తో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ (736 రేటింగ్స్) ఒక ప్లేస్ కోల్పోయి ఐదో స్థానానికి పడిపోయాడు. యంగ్ బ్యాటర్ శుభ్?మన్ గిల్ అగ్ర స్థానం పదిలంగా ఉంచుకున్నాడు. టాప్ -5 లో ముగ్గురు టీమ్‌ఇండియా బ్యాటర్లే ఉండడం విశేషం. ఇక యంగ్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ (704 రేటింగ్స్) 8వ స్థానంలోనే కొనసాగుతుండగా, న్యూజిలాండ్ యంగ్ బ్యాటర్ రచిన్ రవీంద్ర (643 రేటింగ్స్) సత్తా చాటాడు. ఏకంగా 14స్థానాలు మెరుగుపర్చుకొని 14వ ప్లేస్? దక్కించుకున్నాడు. మరోవైపు బౌలింగ్ విభాగంలో మహీశ్ తీక్షణ 680 రేటింగ్స్?తో టాప్?లోనే ఉండగా, మిచెల్ శాంట్నర్ (657 రేటింగ్స్) ఆరు స్థానాలు ఎగబాకి రెండో ప్లేస్?కు దూసుకొచ్చాడు. టీమ్‌ఇండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (650 రేటింగ్స్) మూడు స్థానాలు మెరుగుపర్చుకొని మూడో ప్లేస్?లో కొనసాగుతున్నాడు. సీనియర్ రవీంద్ర జడేజా (616 రేటింగ్స్) టాప్ 10లోకి ఎంట్రీ ఇచ్చాడు. ప్రస్తుతం 10వ స్థానంలో ఉన్నాడు.

## సన్ రైజర్స్ అభిమానులకు
# బిగ్ సర్ప్రైజ్

### సన్ రైజర్స్ కొత్త జెర్సీ విడుదల


ఐపీఎల్ జోష్ మరికొన్ని రోజుల్లోనే మొదలవబోతోంది. టోర్నీలోని ఫ్రాంచైజీల సందడి మాములుగా లేదు. హైదరాబ్దా కు చెందిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తాజాగా అభిమానులకు బిగ్ సర్ప్రైజ్ ఇచ్చింది. ఈ సీజన్ కు గాను తమ జట్టు సభ్యులు ధరించే జెర్సీ ఫొటోలని తాజాగా విడుదల చేసింది. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఇందుకు సంబంధించిన పోస్టును రిలీజ్ చేశారు. ఈ వీడియో క్షణాల్లో వైరలైంది. కుర్రాళ్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ నూతన జెర్సీలను ధరించి, తగ్గేదేలే అన్నట్లుగా ఫోజు పెట్టారు. ఇక ఈ వీడియోపై కామెంట్లు చేస్తూ, లైకులు, షేర్లతో సోషల్ మీడియాను ఆరెంజ్ ఆర్మీ సభ్యులు షేక్ చేస్తున్నారు. దాదాపుగా గతేడాది ధరించిన జెర్సీలానే ఉంది. ఇక గతేడాది ధనాధన్ ఆటతీరుతో మైమరిపించిన సన్ రైజర్స్.. ఈ ఏడాది తన జట్టును మరింత పటిష్టం చేసుకుంది. కోర్ టీమ్ లోని చాలామంది ప్లేయర్లను రిటైన్ చేసుకున్న సన్.. ఈ ఏడాది ఇషాన్, మహ్మద్ షమీ, హర్షల్ పటేల్, ఆడమ్ జంపాలాంటి ప్లేయర్లను జట్టులోకి తీసుకుంది. దీంతో టీమ్ మరింత బలోపేతమైనట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. గతేడాది ఫటాఫట్ ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టారు సన్ బ్యాటర్లు. ముఖ్యంగా ఆరంభంలోనే ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ.. ప్రతి బంతిని బౌండరీకి తరలించాలని ఆడుతూ, ముచ్చెటమలు పట్టించారు. హెన్రీచ్ క్లాసెన్, నితీశ్ రెడ్డి కూడా ధనాధన్ ఆటతీరుతో ఎంతో మంది బౌలర్లకు నిద్ర లేని రాత్రుళ్లను మిగిల్చాడు. ఈ ఏడాది ఇషాన్, అభినవ్ మనోహర్ లాంటి హిట్టర్లతో బలం మరింత పెరిగింది. ఇక బౌలింగ్ లో షమీ, హర్షల్, జంపా, కెప్టెన్ పాట్ కమిన్స్ రాకతో మరింత స్ట్రాంగ్ గా మారింది. ఈనెల 23ను హైదరాబాద్ లోని ఉప్పల్ మైదానం వేదికగా తమ తొలి మ్యాచ్ ను ఆడనుంది. మ.3.30 గంటలకు మాజీ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ తో తలపడనుంది. 2016 టైటిల్ గెలిచిన సన్.. 2018, 2024లో రన్నరప్ గా నిలిచింది. దీంతో ఈసారి మరో టైటిల్ నెగ్గాలని భావిస్తోంది.





## రికార్డ్ బ్రేక్ చేసిన హార్దిక్

హార్దిక్ పాండ్య గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే కొన్ని సందర్భాల్లో మైదానంలో మ్యాచ్ ఆడేటప్పుడు తన వింత హావాభావాలతో రకరకాల పోజులిస్తుంటాడు హార్దిక్. అలానే రీసెంట్ గా ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీలోనూ విజయం సాధించిన తర్వాత తనకు అలవాటైన హావాభావలను ప్రదర్శిస్తూ ఫొటోకు పోజు ఇచ్చాడు హార్దిక్. ఛాంపియన్స్ ట్రోఫీతో కలిసి దుబాయ్ పిచ్‌పై ఫొటో దిగాడు. ఇప్పుడా ఫొటోనే సోషల్ మీడియాలో ఓ రికార్డును అందుకుంది. హార్దిక్ దిగిన ఆ పోజు.. కోహ్లీ రికార్డును కూడా బ్రేక్ చేసింది. గత టీ20 వరల్డ్ కప్ లో భారత్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఆ ట్రోఫీతో కోహ్లీ ఓ ఫొటో దిగి పోస్ట్ చేయగా.. అది కేవలం ఏడు నిమిషాల్లోనే 1 మిలియన్ లైక్స్‌ను దక్కించుకుంది. కానీ, ఇప్పుడు హార్దిక్ పాండ్య దిగిన పిక్ ఆ రికార్డును బ్రేక్ చేసింది. ఆరు నిమిషాల్లోనే మిలియన్ లైక్స్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట్లో కోటీ 60 లక్షలకు పైగా లైక్స్ ను దక్కించుకుంది. దీంతో కోహ్లీ రికార్డును హార్దిక్ పాండ్య బ్రేక్ చేశాడంటూ క్రికెట్ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కాగా, భారత్ కు ఇది మూడో ఛాంపియన్స్ ట్రోఫీ (2002, 2013, 2025) కావడం విశేషం. చివరి సారిగా గత (2017) ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు భారత్ చేరినప్పటికీ పాక్ చేతిలో ఓడిపోయింది. ఆ జట్టులో కూడా హార్దిక్ పాండ్య ఆల్‌రౌండర్ గా ఉన్నాడు. ఇక ఇప్పుడు విజేతగా నిలిచిన జట్టులోనూ పాండ్య ఉన్నాడు.



## ఆడవారిని నిందించడం
# ఫ్యాషన్ అయింది

### ధనశ్రీ వర్మ ఆసక్తికర పోస్ట్


టీమ్ ఇండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ విడిపోతున్నారంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో తరచూ వీరు వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవల వీరికి విడాకులు మంజూరైనట్టు వార్తలు వచ్చాయి. కానీ అవి నిజం కాదని.. విడాకుల వ్యవహారం ఇంకా కోర్టు పరిధిలోనే ఉందని ధనశ్రీ వర్మ లాయర్ వివరణ ఇవ్వడంతో ఆ వార్తలకు బ్రేక్ పడింది. ఇక ఆదివారం జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను చాహల్ ఓ అమ్మాయితో కలిసి వీక్షించడం ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది. ఒకవైపు దేశమంతా టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన సంబరాల్లో ఉంటే.. మరోవైపు క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ గురించి కూడా అంతే చర్చ నడుస్తోంది. దీనికి కారణం చాహల్ సోషల్ మీడియా స్టార్, రేడియో జాకీ మహవష్‌తో జంటగా కనిపించాడు. దీంతో చాహల్-వర్మ విడిపోవడానికి ఈ అమ్మాయే కారణం అని రూమర్లు మొదలయ్యాయి. స్టేడియంలో ఇద్దరూ ఉన్న ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో ధనశ్రీ వర్మ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. మహిళలను నిందించడం ఎప్పుడూ ఫ్యాషనే అంటూ రాసుకొచ్చారు. ఈ పోస్టుకు నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. విడాకుల వార్తల విషయంలో తనపై వస్తున్న ట్రోల్స్‌కు ఆమె ఇలా స్పందించారంటూ కామెంట్స్ చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం ధనశ్రీ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. చాహల్, ధనశ్రీ 2020లో వివాహం చేసుకున్నారు. కొరియోగ్రాఫర్‌గా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు ధనశ్రీ.. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను అలరించేవారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ జంట.. గతంలో పెట్టిన పోస్టులు అభిమానులను గందరగోళానికి గురిచేశాయి. సోషల్ మీడియాలో వీరిద్దరూ ఒకరిని ఒకరు అన్‌ఫాలో చేసుకోవడం. ధనశ్రీ తన పేరు నుంచి చాహల్ పేరును తీసేయడంతో వీరు విడాకులు తీసుకోబోతున్నారంటూ రూమర్స్ వ్యాపించాయి. అంతేకాదు ధనశ్రీ, చాహల్ జంట ఇటీవల కోర్టుకు హాజరైనట్టు కథనాలు వచ్చాయి. వీరిద్దరికి 45 నిమిషాలు పాటు కౌన్సిలింగ్ ఇచ్చిన జడ్జి విడిపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారని.. పరస్పర అంగీకారంతో జడ్జి విడాకులకు ఆమోదం తెలిపినట్టు తెలిసింది. ధనశ్రీ భరణంగా రూ.60 కోట్లు డిమాండ్ చేసినట్టు వార్తలు వినిపించాయి. ఈ వార్తలపై స్పందించిన ధనశ్రీ లాయర్.. న్యాయపరమైన ప్రక్రియపై అప్పుడే మాట్లాడడం సరికాదని.. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉందన్నారు. కథనాలు రాసేముందు వాస్తవాలు తెలుసుకోవాలని.. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయకూడదని అన్నారు.





## మోహన్‌బాబుతో మాకెలాంటి ఆస్తి గొడవలు లేవు : సౌందర్య భర్త

సీనియర్ నటుడు మోహన్‌బాబుతో తమకెలాంటి ఆస్తిగొడవలు లేవని దివంగత నటి సౌందర్య భర్త రఘు అన్నారు. సౌందర్య మరణం ప్రమాదవశాత్తూ జరిగింది కాదంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలు వైరల్ అయ్యాయి. ముఖ్యంగా మోహన్‌బాబు పేరు ఉపయోగిస్తూ పోస్టులు దర్శనమిచ్చాయి. దీంతో ఆయనకు మద్దతుగా సౌందర్య భర్త రఘు బహిరంగ లేఖ విడుదల చేశారు. "హైదరాబాద్‌లోని సౌందర్య ఆస్తికి సంబంధించి కొన్ని రోజులుగా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఆమె ఆస్తిని నటుడు మోహన్‌బాబు ఆక్రమించుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నా. ఆయనతో సౌందర్య ఎలాంటి భూ లావాదేవీలు జరపలేదు. వారి కుటుంబంతో మాకు 25 ఏళ్లుగా మంచి అనుబంధం ఉంది. నేను మోహన్‌బాబును ఎంతో గౌరవిస్తా. మేమంతా ఒకే కుటుంబంగా ఉంటాం. మాకెలాంటి ఆస్తి గొడవలు, లావాదేవీలు లేవు" అని పేర్కొన్నారు.




## ఆసక్తిగా 'భద్రకాళి' టీజర్

విజయ్ ఆంటోనీ హీరోగా తెరకెక్కుతున్న 25వ సినిమా 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకుడు. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రచారంలో భాగంగా టీజర్‌ను బుధవారం విడుదల చేసింది చిత్ర బృందం. రాజకీయ వ్యవస్థ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో హీరో పాత్ర గ్యాంగ్‌స్టర్‌తోపాటు మరికొన్ని కోణాల్లో కనిపించనున్నట్టు టీజర్ చూస్తే అర్థమవుతోంది. "రూ. 197 కోట్లా?.. ఇది కేవలం ఆరంభమే" అంటూ టీజర్ చివరిలో వినిపించిన సంభాషణలు సినిమాపై ఆసక్తి రేకెత్తించేలా ఉన్నాయి.



## కార్తిక్ ఆర్యన్, శ్రీలీల డేటింగ్ వార్తలు..

### హీరో తల్లి ఆసక్తికర వ్యాఖ్యలు

ముంబయి: బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్, నటి శ్రీలీల డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజుల నుంచి బీటౌన్‌లో ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. కార్తిక్ ఫ్యామిలీ పార్టీలో శ్రీలీల పాల్గొనడంతో ఈ వార్తలు తెరపైకి వచ్చాయి. ఇదిలాఉండగా, తమ ఇంటికి ఎలాంటి అమ్మాయి కోడలిగా రావాలో తెలియజేస్తూ కార్తిక్ ఆర్యన్ తల్లి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఐఫా' వేడుకల్లో పాల్గొన్న ఆమెను నిర్మాత కరణ్‌జోహార్ కాబోయే కోడలి గురించి ప్రశ్నించారు. "ఒక మంచి వైద్యురాలు మా ఇంటికి కోడలిగా రావాలని మేమంతా కోరుకుంటున్నాం" అని ఆమె తెలిపారు. నటిగా రాణిస్తోన్న శ్రీలీల.. ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతోన్న విషయం తెలిసిందే. చదువుతోపాటే కెరీర్‌లోనూ కొనసాగడంపై ఎన్నో సందర్భాల్లో ఆమె ఆనందం వ్యక్తంచేశారు. కార్తిక్ – శ్రీలీల డేటింగ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోన్న వేళ హీరో తల్లి వ్యాఖ్యలు వాటికి మరింత ఆజ్యం పోసేలా ఉన్నాయి. శ్రీలీలను ఉద్దేశించే ఆమె ఈ వ్యాఖ్యలు చేశారని పలువురు భావిస్తున్నారు. దక్షిణాదిలో హీరోయిన్‌గా గుర్తింపుతెచ్చుకున్న శ్రీలీల.. బాలీవుడ్‌లో తన సత్తా చాటుకునేందుకు సిద్ధమయ్యారు. అనురాగ్ బసు దర్శకత్వంలో ఆమె ఓ సినిమా చేస్తున్నారు. ఆ సినిమాలో కార్తిక్ ఆర్యన్ హీరోగా నటించడం విశేషం. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే కార్తిక్ – శ్రీలీల మధ్య పరిచయం ఏర్పడిందని.. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ కొంతమంది మాట్లాడుతున్నారు. మరికొంతమంది మాత్రం వాళ్లది కేవలం స్నేహం మాత్రమేనని.. ఆ స్నేహంతోనే ఆమెను ఆయన ఇంటికి ఆహ్వానించారని అనుకుంటున్నారు. మరోవైపు, ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారిన ఈ డేటింగ్ కథనాలపై నటీనటులు ఎక్కడా స్పందించలేదు.




## అందుకే వేరే పరిశ్రమపై దృష్టి పెట్టలేదు

### మోహన్‌లాల్

ఇండస్ట్రీలో సూపర్ స్టార్‌గా ఎదగడం కంటే ఆ స్టార్‌డమ్‌ను నిలబెట్టుకోవడం కష్టం. మలయాళ హీరో మోహన్‌లాల్ ఇప్పటికీ నాలుగున్నర దశాబ్దాలుగా అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తనకు ఇంత గుర్తింపు రావడానికి కారణం మలయాళ పరిశ్రమ అని, అందుకే దీన్ని వీడి మరో పరిశ్రమపై దృష్టిపెట్టలేదని తెలిపారు. మలయాళ ప్రేక్షకులు మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఎప్పుడూ ఆదరిస్తారన్నారు. మలయాళంలో నటించడం వల్లే మీకు గుర్తింపు వచ్చిందని భావిస్తున్నారా అనే ప్రశ్నకు మోహన్‌లాల్ ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా అవునన్నారు. "ఇతర భాషల్లో అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లకుండా ఇక్కడే నటించాలని నిర్ణయించుకున్నాను. ఇతర భాషల్లో ఎన్నో అవకాశాలు వచ్చాయి. మలయాళ పరిశ్రమ ఉత్తమ చిత్రాలను తెరకెక్కిస్తుంది. సాంకేతికంగానూ అభివృద్ధి చెందాం. ఇక్కడి ప్రేక్షకులకు సినిమాలపై ఉన్న అభిమానం వల్లే గొప్ప చిత్రాలు వస్తున్నాయి. కళాత్మక చిత్రాలు నిర్మించడంలోనూ ఈ ఇండస్ట్రీ ఎప్పుడూ ముందుంటుంది. అందుకే ఇతర పరిశ్రమలతో పోలిస్తే ఇక్కడ గొప్ప సినిమాలు తెరకెక్కుతున్నాయి. ఈ మార్పు రాత్రికి రాత్రే వచ్చింది కాదు.. కాలక్రమేణా అభివృద్ధి చెందింది. ఇలాంటి గొప్ప పరిశ్రమలో భాగమైన నేను మరో ఇండస్ట్రీ వైపు ఎందుకు చూడాలి?" అని మోహన్‌లాల్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

## ఆ సమయంలో నూడుల్స్ తిని బతికాం

### దియా మీర్జా



ముంబయి: మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన సమయంలో తాను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నట్లు గుర్తుచేసుకున్నారు నటి దియా మీర్జా. ఆ సమయంలో చేతిలో డబ్బుల్లేక ఇబ్బందిపడ్డానని ఆమె అన్నారు. కుటుంబసభ్యుల నుంచి అంతగా సపోర్ట్ ఉండేది కాదన్నారు. చాలీచాలని డబ్బుతో జీవితాన్ని కొనసాగించానని తెలిపారు. "2000లో నేను, ప్రియాంకా చోప్రా, లారా దత్తా.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్న విషయం అందరికీ తెలిసిందే. ప్రియాంకకు కుటుంబసభ్యుల నుంచి ఎంతో సపోర్ట్ ఉండేది. మాకు సపోర్ట్ చేయడానికి ఎవరూ ఉండేవారు కాదు. మోడలింగ్‌లో రాణిస్తోన్న కారణంగా అప్పటికే లారా ముంబయిలో ఒక ఇరికింట్లో అద్దెకు ఉండేది. నేను ముంబయి వచ్చినప్పుడు.. ఆమె నాకెంతో సాయంగా నిలిచింది. తన రూమ్‌లో ఉండేందుకు అవకాశం కల్పించింది. చిన్న ఇల్లే అయినప్పటికీ మేమిద్దరం సర్దుకుపోయాం. ఫ్యాషన్ షోల్లో పాల్గొని.. ఖరీదైన దుస్తులు ధరించినప్పటికీ ఒక్కోసారి చేతిలో చిల్లిగవ్వ ఉండేది కాదు. చాలీచాలని డబ్బుతోనే జీవితాన్ని కొనసాగించాం. కొన్నిసార్లు నూడుల్స్ తిని రోజులు గడిపాం. మా పరిస్థితిని తలుచుకొని నవ్వుకునేవాళ్లం. ఖరీదైన దుస్తులు వేసుకున్నా.. తినేది మాత్రం నూడుల్స్ అనుకునేవాళ్లం" అని దియామీర్జా ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. 2000 మిస్ ఇండియా పోటీల్లో లారా దత్తా విజేతగా కిరీటాన్ని అందుకోగా.. ఫస్ట్ రన్నరప్‌గా ప్రియాంకా చోప్రా, సెకండ్ రన్నరప్‌గా దియా మీర్జా నిలిచారు. 2001లో విడుదలైన 'రెహ్నా హై తేరే దిల్ మే'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు దియా మీర్జా. అనంతరం ఆమె బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేశారు. 2021లో విడుదలైన 'వైల్డ్ డాగ్' అనే తెలుగు సినిమాలో ఆమె నటించారు.

## సినిమా అవార్డుల విషయాన్ని వివాదం చేయొద్దు : దిల్‌రాజు



హైదరాబాద్: తెలుగు సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన వివరాలను తెలియజేస్తూ తాజాగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఏప్రిల్ నెలలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని ఆయన తెలిపారు. "గద్దర్ అవార్డులకు సంబంధించిన విధి విధానాలు ఖరారయ్యాయి. పైడి జయరాజ్, కాంతారావు పేరుతో గౌరవ పురస్కారాలు అందించనున్నాం. తెలుగుతోపాటు ఉర్దూ సినిమాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆ సినిమాకు బెస్ట్ ఫిల్మ్ అవార్డు ఇవ్వనున్నాం. 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ వరకూ విడుదలైన చిత్రాల్లో ప్రతి ఏడాది ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేసి అవార్డు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. 2024కు సంబంధించి కొన్ని మార్పులు చేర్పులతో పాత రోజుల్లోని అవార్డుల ప్రక్రియనే కొనసాగించనున్నాం. ఏప్రిల్‌లో ఈ కార్యక్రమాన్ని వైభవంగా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో సింహా అవార్డుల కోసం దరఖాస్తుదారులు ఎఫ్‌డీసీకి కొంత డబ్బు పంపించినట్లు తెలిసింది. ఆ డబ్బును వారికి ఇప్పుడు తిరిగి ఇచ్చేస్తాం. సినిమా అవార్డుల విషయాన్ని వివాదం చేయొద్దు. దీనిని ప్రతి ఒక్కరూ పాజిటివ్‌గా అనుకుని విజయవంతం చేయాలి. అప్పుడే ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని మనం ఘనంగా నిర్వహించుకోగలం" అని ఆయన కోరారు.


## ఓటీటీలోకి 'ముఫాసా: ది లయన్ కింగ్'




హైదరాబాద్: ఓ రాజ్యం.. రాజు.. యువరాజు.. అక్కడ సింహాసనం కోసం జరిగే ఎత్తులకు పైఎత్తులు.. ఇవన్నీ మనం చాలా సినిమాల్లో చూసే ఉంటాం. ఇలాంటి కథతో తెరకెక్కిన చిత్రమే 'ముఫాసా: ది లయన్ కింగ్'. ప్రముఖ హాలీవుడ్ సంస్థ డిస్నీ రూపొందించిన ఈ మ్యూజికల్ లైవ్ యాక్షన్ చిత్రం గతేడాది విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇంగ్లీష్‌తోపాటు పలు భారతీయ భాషల్లోనూ ఈ సినిమా నిర్మితమైంది. సినిమాలో కీలకమైన ముఫాసా పాత్రకు తెలుగులో అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు.. హిందీలో షారుక్ ఖాన్ డబ్బింగ్ చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడీ చిత్రం ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు మరోసారి వినోదం పంచేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా మార్చి 26 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఇది అందుబాటులో ఉండనుందని తాజాగా ఓటీటీ సంస్థ ప్రకటించింది. 2019లో విడుదలైన 'ది లయన్ కింగ్'కు ప్రీక్వెల్‌గా వచ్చిన చిత్రమిది. ముఫాసా అసలు రాజుగా ఎలా మారాడు? ఆయన గత చరిత్ర ఏంటి? అనే అంశాలను ఈ సినిమాలో చూపించారు.

## 'లస్ట్ స్టోరీస్'.. అప్పుడే కియారాను కలిశా : సిద్ధార్థ్ మల్హోత్ర

ముంబయి: తన సతీమణి, నటి కియారా అడ్వాణీ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు నటుడు సిద్ధార్థ్ మల్హోత్ర. ఆమె ఎంతో పద్ధతిగా ఉంటుందని అన్నారు. కుటుంబానికి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. తమ వైవాహిక జీవితం సంతోషంగా కొనసాగుతోందన్నారు. ఆమె నటించిన 'లస్ట్ స్టోరీస్' షూట్‌లో తాను పాల్గొన్నానని అన్నారు. ముఖ్యంగా కియారాపై చిత్రీకరించిన వైరల్ సీన్ గురించి ఆయన మాట్లాడారు. "కియారా అడ్వాణీ 'లస్ట్ స్టోరీస్' (2018)లో యాక్ట్ చేస్తున్నప్పుడు ఆ చిత్రీకరణకు నేనొకసారి హాజరయ్యా. ఆమెతో మాట్లాడేందుకు ఆ సెట్‌కు వెళ్లా. ఆ సిరీస్‌లో కియారాపై ఒక వైరల్ సీన్ చిత్రీకరించారు. ఆ సీన్ షూట్ సమయంలో నేను అక్కడే ఉన్నా. ఆ తర్వాత ఆమెను కలిశా. కాసేపు సరదాగా మాట్లాడుకున్నాం. ఈ సిరీస్‌కు సంబంధించిన కథను కరణ్ జోహార్ నాకు ముందే చెప్పారు. ఇలాంటి స్టోరీతో సిరీస్ చేయడం నాకు ఆసక్తిగా అనిపించింది. స్క్రిప్ట్ ఎంపిక విషయంలో కియారా ఎంతో క్లియర్‌గా ఉంటుంది. విభిన్నమైన కథలు ఎంచుకోవడానికి ఇష్టం చూపిస్తుంది." "మా వివాహం తర్వాత మరిన్ని విషయాలు తెలుసుకున్నా. ఆమెతో ప్రయాణం మొదలయ్యాక పలు అంశాలపై నా అభిప్రాయం మారింది. జీవితం, వర్క్, కుటుంబంపై సరైన అవగాహన వచ్చింది. తను కుటుంబానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుంది. పద్ధతులు పాటిస్తుంది. ఆమెలో నాకు నచ్చే విషయమదే. తల్లిదండ్రులుగా పిల్లల ఆలనాపాలనా దగ్గరుండి



చూసుకోవాలనేది నా ఆలోచన. అలా చేస్తేనే పిల్లలతో మనకు మంచి అనుబంధం ఏర్పడుతుంది. నా చిన్నతనంలో నాన్న వర్క్‌లైఫ్ బిజీగా ఉండటం వల్ల అమ్మే మా బాగోగులు చూసుకునేవారు. ఓవైపు స్నేహితులతో కలిసి వ్యాపారం చేస్తూనే మరోవైపు, మా విషయాలు పట్టించుకునేవారు. నా దృష్టిలో ఆమే నా రాక్‌స్టార్" అని అన్నారు. 2021లో 'షేర్షా' సినిమా కోసం తొలిసారి కలిసి వర్క్ చేశారు కియారా అడ్వాణీ, సిద్ధార్థ్ మల్హోత్ర. ఆ సినిమా చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. పెద్దల అంగీకారంతో 2023లో ఈ జంట వివాహబంధంలోకి అడుగుపెట్టింది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463